RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 300 పేజీలు - 08 గురువారం 24 సెప్టెంబర్ 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## ఈసీ నియామక చట్టంపై సుప్రీంకోర్టులో భిన్న తీర్పులు




**తొలి అక్షరం/న్యూఢిల్లీ,సెప్టెంబర్ 23:** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 నాటి చట్టం చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో భిన్న తీర్పు వెలువడింది. ఈ కేసును విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేయాలా? అనే అంశంపై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎస్.సి. శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఏకాభిప్రాయానికి మిగతా2లో...

# తెలంగాణ ఆర్థిక ప్రగతికి గ్లోబల్ సమ్మిట్ కీలకం

### - డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** తెలంగాణలో భారీ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026' ఏర్పాట్లను ప్రభుత్వం ముమ్మరం చేసింది. డిసెంబర్ 7 నుంచి 9 వరకు జరగనున్న సమ్మిట్ ఏర్పాట్లపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సమావేశం నిర్వహించింది.తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యానికి అనుగుణంగా భారీ పెట్టుబడులను ఆకర్షించాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా దేశ, విదేశాల్లో రోడ్‌షోలు నిర్వహించడంతో పాటు పెట్టుబడులకు అవకాశాలు ఉన్న దేశాలు, నగరాలు, రంగాలపై ప్రత్యేక అధ్యయనం చేయాలని నిర్ణయించారు.సమ్మిట్ ఏర్పాట్ల పర్యవేక్షణ మిగతా2లో...



## రైతుల పోరాటం ఫలించింది..

- జూరాల కాలువలకు నీటి విడుదల
కుడి, ఎడమ కాలువలకు సాగునీరు.. కర్ణాటక నుంచి 7 టీఎంసీల నీటికి హామీ

**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** సాగునీటి కోసం జూరాల ఆయకట్టు రైతులు చేపట్టిన ఆందోళన మిగతా2లో...

## ప్రజల ముంగిటకే 'మీ సేవ'లు: మంత్రి శ్రీధర్‌బాబు



**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా, వేగంగా అందించేందుకు లిలి'మీ సేవ డోర్ డెలివరీ సర్వీసెస్'లిలిను ప్రారంభించింది. ఆర్టీసీ కళ్యాణ మండపంలో మంత్రి శ్రీధర్‌బాబు ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించారు.రాష్ట్రంలో ప్రస్తుతం 108 ప్రభుత్వ మీ సేవ కేంద్రాలతో పాటు 5,400కు పైగా ప్రైవేట్ మీ సేవ కేంద్రాలు సేవలు అందిస్తున్నాయని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా భవిష్యత్‌లో మీ సేవ కేంద్రాల సంఖ్యను మరింత పెంచుతామని చెప్పారు.ఇకపై ప్రజలు మీ సేవ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయడం లేదా మీ సేవ పోర్టల్‌లో స్లాట్ బుక్ చేసుకోవడం ద్వారా ఇంటి వద్ద నుంచే సేవలు పొందవచ్చని తెలిపారు. మీ సేవ ఎగ్జిక్యూటివ్‌లు నేరుగా ఇంటికి వచ్చి అవసరమైన సేవలను అందించనున్నారు. మిగతా2లో...



## తెలుగు రాష్ట్రాలకు కొత్త బీజేపీ ఇన్‌చార్జిలు

ఏపీకి అరవింద్ భదౌరియా.. తెలంగాణకు సునీల్ బన్సల్
ఇతర రాష్ట్రాల్లోనూ తెలుగు నేతలకు బాధ్యతలు

**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** బీజేపీ సంస్థాగత వ్యవహారాల్లో కీలక మార్పులు చోటుచేసుకు న్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కొత్త ఇన్‌చా ర్జిలు, కో-ఇన్‌చార్జిలను పార్టీ అధిష్ఠానం నియమించింది. రాష్ట్రాల్లో పార్టీ కార్యకలాపాలను మరింత సమన్వయంతో ముందుకు తీసుకెళ్లే ఉద్దేశంతో ఈ నియామకాలు మిగతా2లో...

## తుమ్మల చెరువుకు గోదావరి జలాలు

అశ్వాపురం రైతుల చిరకాల స్వప్నం సాకారం
'మారేళ్లపాడు ఎత్తిపోతల'ను ప్రారంభించిన మంత్రులు తుమ్మల, పొంగులేటి
తొలి విడతలో 4,300 ఎకరాలకు.. దశలవారీగా 23 వేల ఎకరాలకు సాగునీరు




## జలాల వినియోగంపై శ్వేతపత్రం ప్రకటించాలి

- బీఆర్ఎస్ఎల్పీ ఉపనాయకుడు తన్నీరు హరీశ్‌రావు డిమాండ్
- గురుదక్షిణ కింద తెలంగాణ వాటాను ఆంధ్రాకు ధారాదత్తం



**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, సా గునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలకు ద మ్ముంటే మూడేళ్లల్లో కృష్ణ, గోదావరి జలాలు ఎంత వినియోగమయ్యాయో శ్వేతపత్రం ప్రక టించాలని బీఆర్ఎస్ ఎల్పీ ఉపనాయకుడు త న్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. గురుదక్షి ణ కింద కృష్ణ, గోదావ రి జలాలను ఆంధ్ర ప్రాం తానికి ధారాదత్తం చేయడం తప్పా రైతాంగాని కి ప్రయోజనం చేకూరిన అంశం ఒక్కటి మిగతా2లో...

## కాంగ్రెస్ వైఫల్యం వల్లే కరెంటు కోతలు

బొగ్గు కొరతతో థర్మల్ విద్యుత్ ప్లాంట్ల మూత
జెన్‌కోకు నాసిరకం బొగ్గు సరఫరాతో రూ.2,900 కోట్ల నష్టం
నేడు పవర్‌ప్లాంట్ల సందర్శన : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యం వల్లే కరెంటు కోతలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. బొగ్గు కొరత కారణంగా థర్మల్ విద్యుత్ కేంద్రాల్లోవిద్యుత్ ఉత్పత్తి నిలిపేస్తున్నారని అన్నారు. నీటి కొరత వల్ల జల విద్యుత్ కేంద్రాలు కూడా విద్యుత్ ఉత్పత్తి చేయలేకపోతున్నాయని చెప్పారు. ఇప్పుడే విద్యుత్ కోతలు ఇలా ఉంటే వేసవిలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ కేంద్రాల వద్ద వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు గురువారం ఆరు బీఆర్ఎస్ బృందాలు రాష్ట్రంలోని థర్మల్ పవర్ ప్లాంట్లు, సింగరేణి ప్రధాన కార్యాలయా న్ని సందర్శించనున్నాయని వెల్లడించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసినసమావేశంలో కేటీఆర్ మిగతా2లో...

## మా షరతులకు అంగీకరిస్తేనే హార్ముజ్‌ను తెరుస్తాం

స్పష్టం చేసిన ఇరాన్...న్యూయార్క్‌లో అమెరికా ప్రతినిధులతో అరాగ్చీ భేటీ








## దేవాదుల నీటిని సంపూర్ణంగా వినియోగిస్తాం: మంత్రి ఉత్తమ్

తుంగతుర్తికి దేవాదుల జలాలు తీసుకొస్తాం..
ఒక్క చుక్క నీరూ వృథా కాకుండా చర్యలు

**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** గోదావరి, దేవాదుల ప్రాజెక్టుల నీటిని సంపూర్ణంగా వినియోగించుకునేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తుంగతుర్తి నియోజకవర్గానికి దేవాదుల ప్రాజెక్టు నీటిని తీసుకొస్తానని హామీ ఇచ్చారు.బుధవారం సూర్యాపేట జిల్లాలో పర్యటించిన మంత్రి ఉత్తమ్ మిగతా2లో...

# రైతుల పోరాటం ఫలించింది..

(మొదటి పేజీ తరువాయి)

ఫలించింది. వారం రోజులుగా పంట కాలువలకు నీటిని విడుదల చేయాలని రైతులు చేస్తున్న పోరాటం నేపథ్యంలో బుధవారం జూరాల రిజర్వాయర్ నుంచి కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేశారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. పంట కాలువలకు నీరు విడుదల చేయాలని రైతులు ఆందోళన చేపట్టగా, గత రెండు రోజులుగా నిరసనలు మరింత ఉధృతమయ్యాయి. రైతుల ఆందోళనకు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కూడా మద్దతు ప్రకటించారు. తాగునీటి అవసరాలకు మాత్రమే జూరాలలో నీరు ఉందని అధికారులు చెప్పడంతో రైతుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. **కర్ణాటక నుంచి నీటికి హామీ**జూరాల ఆయకట్టు రైతుల సాగునీటి సమస్యను ఉమ్మడి పాలమూరు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కర్ణాటకకు వెళ్లిన ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజాప్రతినిధులు బెంగళూరులో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిసి జూరాలకు నీటిని విడుదల చేయాలని కోరారు. రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని 30 రోజులపాటు రోజుకు 5 వేల క్యూసెక్కుల చొప్పున మొత్తం 7 టీఎంసీల నీటిని జూరాల ప్రాజెక్టుకు విడుదల చేస్తామని డీకే శివకుమార్ హామీ ఇచ్చినట్లు ప్రజాప్రతినిధులు తెలిపారు. **2,687 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులోకి ప్రస్తుతం 2,687 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు బుధవారం ఉదయం 8 గంటల సమయంలో కుడి, ఎడమ కాలువల వద్దకు చేరుకుని తూములను తెరిచి నీటిని విడుదల చేశారు. ఇన్‌ఫ్లో ఇదే స్థాయిలో కొనసాగితే ప్రాజెక్టు నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటే స్పిల్‌గేట్లను తెరిచి దిగువకు నీటిని విడుదల చేయాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది. **రైతుల్లో ఉపశమనం** సాగునీటి కోసం రైతులు చేపట్టిన ఆందోళన నేపథ్యంలో కాలువలకు నీరు విడుదల కావడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు కర్ణాటక నుంచి 7 టీఎంసీల నీటి విడుదలకు హామీ లభించడంతో జూరాల ఆయకట్టు సాగునీటి అవసరాలకు కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది.

# కాంగ్రెస్ వైఫల్యం వల్లే కరెంటు కోతలు

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు కరెంట్ విలాస వస్తువు కాదనీ, జీవనరేఖ అని అన్నారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, పరిశ్రమలు, ఐటీ రంగం, గృహ అవసరాలు అన్నింటికీ విద్యుత్ అత్యంత కీలకమని చెప్పారు. విద్యుత్ సమస్యపైనే తెలంగాణ మలిదశ ఉద్యమానికి పునాది పడిందని గుర్తుచేశారు. 'ఎల్‌నినో కాదు.. ఎల్ కాంగో' విద్యుత్ సంక్షోభానికి ఎల్‌నినో ప్రభావం కారణం కాదనీ, ఎల్ కాంగో (కాంగ్రెస్) ప్రధాన కారణమని కేటీఆర్ విమర్శించారు. విద్యుత్ సంక్షోభానికి సింగరేణి బొగ్గు సరఫరా వ్యవస్థ కూడా ఒకటని అన్నారు. సింగరేణితో సర్కార్ ఫుట్‌బాల్ సింగరేణి సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఫుట్‌బాల్ ఆట ఆడుతున్నదని కేటీఆర్ అన్నారు. సింగరేణితో కార్మికులు, రైతులు, ప్రజలు ఆటలాడే పరిస్థితి రావొద్దని కోరారు. సింగరేణిలో సైట్ విజిటేషన్ సర్టిఫికెట్ల పేరుతో అక్రమాలు, సోలార్ పవర్ టెండర్లలో అవకతవకలు జరిగాయని విమర్శించారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి 2023-24లో 70 మిలియన్ టన్నుల నుంచి 2025-26లో 58 మిలియన్ టన్నులకు ఎందుకు పడిపోయిందని ప్రశ్నించారు. వ్యవసాయానికి ఆరు గంటల కరెంటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వ్యవసాయానికి ఆరు గంటలకు మించి కరెంట్ సరఫరా కావడం లేదని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఉంటే కరెంటు ఉండదు' కాంగ్రెస్ అధికారంలో ఉంటే కరెంటు ఉండదని కేటీఆర్ అన్నారు. అదే ఇప్పుడు నిజమైందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలోనూ రైతులు విద్యుత్ కోతలపై రోడ్డెక్కారని గుర్తు చేశారు. విద్యుత్ వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఆరు బీఆర్ఎస్ బృందాలు గురువారం పవర్ స్టేషన్లను సందర్శిస్తాయని చెప్పారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్‌ను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను మాజీ మంత్రి పువ్వాడ అజయ్, భూపాలపల్లిలోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌ను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చెన్నూరు నియోజకవర్గం జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, అనిల్ జాదవ్‌ల బృందం సందర్శిస్తుందని వివరించారు. హైదరాబాద్‌లోని సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే వివేకానందగౌడ్ పరిశీలిస్తారని చెప్పారు. మాజీమంత్రులు తాటికొండ రాజయ్య, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, ఎల్ రమణ, ఎమ్మెల్యేలు కెపి వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు ఎ జీవన్‌రెడ్డి, బాల్క సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మల చెరువుకు గోదావరి జలాలు

**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 23 :**తుమ్మల చెరువుకు గోదావరి జలాలు అందించాలన్న రైతుల చిరకాల కోరిక నెరవేరిందని మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలంలో సీతారామ కాలువపై నిర్మించిన మారేళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని బుధ వారం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. పంపులు ఆన్ చేసి గోదావరి జలాలను తుమ్మల చెరువుకు విడుదల చేశారు. సుమారు రూ.610 కోట్ల అంచనాతో చేపట్టిన ఈ పథకం ద్వారా తొలి విడతలో 4,300 ఎకరాలకు, దశలవారీగా అశ్వాపురం మండలంలో 22 నుంచి 23 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. అనంతరం గొందిగూడెంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి అశ్వాపురం, పినపాక నుంచి పాలేరు వరకు గోదావరి జలాలను తీసుకెళ్లాలని నిర్ణయించామన్నారు. ఆర్థిక ఇబ్బందులు, అనుమతులు, సవరించిన అంచనాలను అధిగమిస్తూ పనులు చేయిస్తున్ను తెలిపారు. సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీలకు అదనపు నిధులను సీఎం మంజూరు చేశారని, ఇల్లెందుకు జూలూరుపాడు టన్నెల్, లలితాపురం వద్ద ఎత్తిపోతలపై సర్వేలు చేసి అంచనాలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. అన్నదైవం ప్రాజెక్టుకు కూడా జలాలు విడుదల చేస్తున్నామని చెప్పారు. భూసేకరణలో రైతులు సహకరించాలని కోరారు. న్యాయమైన పరిహారం రైతులకు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా పది నియోజకవర్గాల్లో సాగునీటి విస్తరణకు కృషి చేస్తున్నామని, భద్రాచలంలో ప్రగళ్లపల్లి ఎత్తిపోతలతో పాలెంవాగు, తాలిపేరు, మోడికుంటవాగు అనుసంధానం చేస్తే మరిన్ని మండలాలకు నీరు అందుతుందన్నారు. ప్రస్తుత వర్షాభావం, ఎల్‌నినో నేపథ్యంలో నీరు, విద్యుత్‌ను పొదుపుగా వాడాలని, రబీలో తక్కువ నీటి పంటలు వేయాలని సూచించారు. ఆయిల్‌పామ్ మొక్కలు అందిస్తామన్నారు. రూ.350 కోట్లతో భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభించామని, పుష్కరాల నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. పులుసుబొంత్ ప్రాజెక్టు భూసేకరణ, ప్రత్యామ్నాయ భూముల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లకు నిధులు మంజూరు చేసి టెండర్లు పిలుస్తామన్నారు. బూర్గంపాడులో దొమ్మలవాగు రిజర్వాయర్‌పై ప్రజల అవసరాల మేరకు చర్యలు తీసుకుంటామని, గిరిజన గుడిసె వాసులకు ఇందిరమ్మ ఇండ్లలో ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. పేదలు, రైతులు, గిరిజనులు, మహిళలు, యువత సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఎంపీ పోరిక బలరాంనాయక్ మాట్లాడుతూ మారేళ్లపాడు ద్వారా అశ్వాపురంలో 24 గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. దశాబ్దాల కల నెరవేరిందని, గోదావరి జలాలు తుమ్మల చెరువుకు చేరడం పండుగ వాతావరణం తెచ్చిందన్నారు. తుమ్మల ప్రధాన కాలువకు లైనింగ్, 22 కి.మీ డిస్ట్రిబ్యూటరీలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మణుగూరు రేగులగండి చెరువుకు నీరిస్తే 4 వేల ఎకరాల్లో మూడు పంటలు పండుతాయని, దొమ్మలవాగును మినీ రిజర్వాయర్‌గా చేయాలని కోరగా మంత్రులు సానుకూలంగా స్పందించారన్నారు. కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. మారేళ్లపాడుతో పాటు జిల్లాలో 16 వేల ఎకరాలకు సాగునీటి పనులకు శ్రీకారం చుట్టామని, పులుసుబొంత్‌కు కాంపెన్సేటరీ అఫారెస్టేషన్ భూముల గుర్తింపు కొనసాగుతోందన్నారు. అశ్వారావుపేట, దమ్మపేట, చంద్రుగొండ సహా 8 మండలాల్లో డిస్ట్రిబ్యూటరీల సర్వే 60 శాతం పూర్తయిందని, సీతమ్మసాగర్‌కు 600 ఎకరాల భూసేకరణ అవార్డు దశలో ఉందని, రూ.46 కోట్లు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, ఎస్పీ రోహిత్ రాజ్, డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రమ్ సింగ్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

# జలాల వినియోగంపై శ్వేతపత్రం ప్రకటించాలి

(మొదటి పేజీ తరువాయి)

కూడా లేదని దుయ్యబట్టారు. బుధవారం నాగర్‌కర్నూ ల్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావే శంలో ఆయన మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావం పేరు చెప్పి కాంగ్రెస్ నేతలంతా ప్రకృతిని నింది స్తున్నారని, పాలమూరు జిల్లాలో ప్రతీ ప్రాజెక్టు ను సందర్శిస్తే కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలు కన్పి స్తున్నాయన్నారు. కృష్ణానది జలాల వినియోగం లో ట్రైబ్యునల్ తీర్పు వచ్చే వరకు 36 టీఎంసీల నీటిని తెలంగాణ సాగు భూములకు మళ్లించే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా ప్రయత్నాలు చేయలేని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంకెల గారడీతో రైతాంగాన్ని మోసగించే ప్రయత్నం చే యడం ఏమాత్రం సహించరని విషయమన్నా రు. కేసీఆర్ చాలా దూరదృష్టితో కృష్ణ, గోదావరి జలాలపై లిఫ్టులు, రిజర్వాయర్లు నిర్మించారని, బీఆర్ఎస్ పాలన, కాంగ్రెస్ అధికారంలో ఎన్ని ఎకరాల సాగు భూములకు నీరందించారో వివ రాలతో శ్వేతపత్రం ప్రకటించాలని ఆయన డి మాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొం త జిల్లాలో ఎకరా పంట ఎండినా సహించబో మని ఇందుకోసం ఉద్య మిస్తామని స్పష్టం చే శారు. రాబోయే కాలంలో కృష్ణా, గోదావరి నదీ జలాలను మళ్లించే ప్రయత్నం చేస్తే మహోద్య మం తప్పదని హెచ్చరించారు. కేఎల్‌ఐ కింద ఆ యకట్టులో సింహభాగానికి, పాలమూరు రంగా రెడ్డి ఎత్తిపోతల పథకం కింద నార్లాపూర్, ఏదు ల, వట్టెం రిజర్వాయర్ల వరకు కృష్ణా జలాలను పంపింగ్ చేసిన ఘనత కేసీఆర్‌దేనని ఈ అంశంపై బహిరంగ చర్చకు కాంగ్రెస్ నేతలు సిద్ధం కావాలని, వేదిక వాళ్లే నిర్ణయించాలని హరీశ్‌రావు సవాల్ విసిరారు. మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 3 రోజులు భారీ వర్షాలు.. తీరం వైపు తీవ్ర వాయుగుండం

## నేటి అర్ధరాత్రి కళింగపట్నం దక్షిణంవైపు తీరం దాటే చాన్స్

## పలు రాష్ట్రాల్లో నైరుతి నిష్క్రమణ

**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** పశ్చిమ-మధ్య బంగాళాఖాతం, వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండం కేంద్రీకృతమై ఉన్నదని హైదరాబాద్ వాతావారణశాఖ తెలిపింది. గోపాల్‌పురం-కళింగ పట్టణానికి సమీపంలో తీవ్ర వాయుగుండంగా బలపడి బుధవారం అర్ధరాత్రి కళింగపట్నం దక్షిణ తీరాన్ని దాటే అవకాశం ఉన్నదని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో తెలంగాణలో గురు, శుక్రవారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని పేర్కొన్నారు.

# ఈసీ నియామక చట్టంపై సుప్రీంకోర్టులో భిన్న తీర్పులు

(మొదటి పేజీ తరువాయి)

రాలేకపోయింది. దీంతో ఇద్దరు న్యాయమూర్తులు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. **ఏకగ్రీవ తీర్పు వచ్చి ఉంటే బాగుండేది: దత్తా** ఈ అంశంపై ధర్మాసనం ఏకగ్రీవ నిర్ణయానికి వచ్చి ఉంటే సంస్థాగత ఐక్యతకు మరింత ప్రయోజనకరంగా ఉండేదని జస్టిస్ దీపాంకర్ దత్తా పేర్కొన్నారు. అభిప్రాయ భేదాలు ఏర్పడటంతో సుదీర్ఘమైన ఉత్తర్వులు వెలువరించాల్సి వచ్చిందని తెలిపారు. **పాలకులు చట్టానికి లోబడి ఉండాలి** తీర్పు సందర్భంగా జస్టిస్ దత్తా కీలక వ్యాఖ్యలు చేశారు. "పాలకులు చట్టానికి లోబడి ఉండాలి.. ఎవరూ చట్టానికి అతీతులు కారు" అని స్పష్టం చేశారు. వ్యక్తుల ఇష్టాయిష్టాలకు అనుగుణంగా కాకుండా రాజ్యాంగం, చట్టాల పరిధిలోనే పరిపాలన సాగాలని ఆయన ఉద్ఘాటించారు. **కొలీజియం వ్యవస్థపై స్పష్టత** జడ్జీల నియామకం, కొలీజియం వ్యవస్థపై జరుగుతున్న ప్రచారంపైనా సుప్రీంకోర్టు స్పందించింది. "జడ్జీలే తమ సహచర జడ్జీలను నియమించుకుంటున్నారు" అనే ప్రచారం వాస్తవానికి దూరంగా ఉందని పేర్కొంది. న్యాయమూర్తుల అభ్యర్థుల పరిశీలన, ఎంపిక ప్రక్రియలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఇంటెలిజెన్స్ బ్యూరో, ఇతర నిఘా వ్యవస్థల పాత్ర కూడా ఉంటుందని ధర్మాసనం వివరించింది.

# తెలుగు రాష్ట్రాలకు కొత్త బీజేపీ ఇన్‌చార్జిలు

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టినట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జిగా డాక్టర్ అరవింద్ భదౌరియా, కో-ఇన్‌చార్జిగా వనతి శ్రీనివాసన్‌ను నియమించారు. తెలంగాణ బీజేపీ ఇన్‌చార్జిగా సునీల్ బన్సల్, కో-ఇన్‌చార్జిలుగా అభయ్ పాటిల్, రేఖా శర్మలను నియమించారు. **ఇతర రాష్ట్రాల్లో తెలుగు నేతలకు బాధ్యతలు** తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు బీజేపీ నాయకులకు ఇతర రాష్ట్రాల సంస్థాగత బాధ్యతలను కూడా పార్టీ అప్పగించింది. ఏపీ బీజేపీ నేత, మాజీ కేంద్ర మంత్రి దగ్గుబాటి పురందేశ్వరిని ఒడిశా బీజేపీ ఇన్‌చార్జిగా నియమించారు. తెలంగాణకు చెందిన డీకే అరుణకు తమిళనాడు బీజేపీ కో-ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. డాక్టర్ కసమ్ వెంకటేశ్వర్లును కర్ణాటక బీజేపీ కో-ఇన్‌చార్జిగా నియమించారు. **సంస్థాగత విస్తరణపై దృష్టి** రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత కార్యకలాపాలను సమన్వయం చేయడం, రాష్ట్ర నాయకత్వంతో కలిసి పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం ఇన్‌చార్జిల ప్రధాన బాధ్యతల్లో భాగంగా ఉంటుంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో 28 జిల్లాలకు బీజేపీ జిల్లా ఇన్‌చార్జిలను నియమించడంతో పాటు రాష్ట్ర కార్యవర్గాన్ని పునర్వ్యవస్థీకరించిన నేపథ్యంలో తాజా జాతీయ స్థాయి నియామకాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ ప్రకటించినట్లు సమాచారం. ఇదే సమయంలో కొత్త జాతీయ బృందంలో తరుణ్ చుగ్‌కు కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి.

# మా షరతులకు అంగీకరిస్తేనే హార్ముజ్‌ను తెరుస్తాం

**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాలకు హాజరవుతున్న ఇరాన్ ప్రతినిధులతో అమెరికా అధికారులు న్యూయార్క్‌లో మూడు గంటల పాటు సమావేశమయ్యారు. ఈ భేటీ సానుకూలంగా జరిగిందని, ఒప్పందానికి రావడం రాకపోవడం ఇరాన్‌పై ఆధారపడి ఉన్నదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. 'ఇది ఓ మంచి సమావేశం. ఒప్పందానికి వస్తే వారికే ప్రయోజనం' అని వ్యాఖ్యానించారు. ఘర్షణల నివారణ కోసం ఇరాన్ ఎందుకు ఒప్పందం చేసుకోవడం లేదో తాను ఊహించలేకపోతున్నానని చెప్పారు. ఐరాస సర్వసభ్య సమావేశాలకు హాజరవుతున్న ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ అమెరికా ప్రత్యేక రాయబారులు స్టీవ్ విట్‌కాఫ్, జేర్డ్ కుష్నర్‌లతో చర్చలు జరిపారు. ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని వెంటనే ఎత్తివేయాలని, స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయాలని, అన్ని రకాల పోరును నిలిపివేయాలని అరాగ్చీ ఈ సందర్భంగా డిమాండ్ చేశారని తెలిసింది. ఈ డిమాండ్లను నెరవేరిస్తే హార్ముజ్ జలసంధిని తెరుస్తామని ఆయన చెప్పారు. 'వారు నాతో మాట్లాడాలని అనుకుంటున్నారు. వారు మాతో మాట్లాడుతూనే ఉన్నారు. ఈ రోజు కూడా మాట్లాడారు. ఈ సంబంధం అభివృద్ధి చెందుతోంది' అని ఆయన తెలిపారు. చర్చలు కొనసాగుతాయని అంటూ అంతిమంగా ఒప్పందం కుదురుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అయితే అణ్వాయుధాన్ని పొందకుండా ఇరాన్‌ను నిరోధిస్తామని ట్రంప్ పునరుద్ఘాటించారు. ఇరాన్ ప్రతినిధులతో చర్చలపై తాను చాలా సంతోషంగా ఉన్నానని విట్‌కాఫ్ వ్యాఖ్యానించారు. మధ్యవర్తులు తమ ప్రయత్నాలు కొనసాగిస్తారని ఆయన చెప్పారు. కాగా గల్ఫ్, ప్రాంతీయ దేశాల దౌత్య యత్నాల కారణంగానే అమెరికా, ఇరాన్ ప్రతినిధులు చర్చలు జరిపారని తెలుస్తోంది.

# తెలంగాణ ఆర్థిక ప్రగతికి గ్లోబల్ సమ్మిట్ కీలకం

(మొదటి పేజీ తరువాయి)

కోసం సుమారు 10 ప్రత్యేక అధికారుల కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. సీనియర్ అధికారులు, మంత్రులకు వివిధ బాధ్యతలు అప్పగించడంతో పాటు ప్రత్యేక వార్‌రూమ్‌ను ఏర్పాటు చేసి రోజువారీగా ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు. సమ్మిట్‌కు విస్తృత ప్రచారం కల్పించేందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, సోషల్ మీడియా వేదికలను వినియోగించాలని నిర్ణయించారు. అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, గతంలో కుదిరిన ఎంవోయూల అమలు పురోగతిని సమీక్షించాలని భట్టి సూచించారు. ప్రతినిధుల స్పందనను బట్టి సభా ప్రాంగణాల సంఖ్యను ప్రస్తుత 4 నుంచి 6 లేదా 8కు పెంచే అంశాన్ని పరిశీలించనున్నారు. మూడు రోజుల కార్యక్రమంగా మాత్రమే కాకుండా తెలంగాణకు దీర్ఘకాలికంగా పెట్టుబడులు, ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చే వేదికగా గ్లోబల్ సమ్మిట్‌ను తీర్చిదిద్దాలని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు.

# ప్రజల ముంగిటకే 'మీ సేవ'లు: మంత్రి శ్రీధర్‌బాబు

(మొదటి పేజీ తరువాయి)

జనన, మరణ ధృవీకరణ పత్రాలు, ఆదాయ, కుల, నివాస ధృవీకరణ పత్రాలు, ఈసీ కాపీలు, పోలీస్ శాఖ సేవలు, ఐజీఆర్ఎస్ రిజిస్ట్రేషన్లు తదితర పౌర సేవలను డోర్ డెలివరీ ద్వారా అందించనున్నారు. తొలిదశలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఈ సేవలను అమలు చేసి, అనంతరం రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

# దేవాదుల నీటిని సంపూర్ణంగా వినియోగిస్తాం: మంత్రి ఉత్తమ్

(మొదటి పేజీ తరువాయి)

కుమార్ రెడ్డి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా రాష్ట్రానికి అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. **ఒక్క చుక్క నీరూ వృథా కాకుండా..** 365 టీఎంసీల నీటిని ఒక్క చుక్క కూడా వృథా కాకుండా వినియోగించుకునేలా కృషి చేస్తానని మంత్రి పేర్కొన్నారు. దేవాదుల ప్రాజెక్టు నీటి లభ్యత, వినియోగంపై వివరాలు వెల్లడించారు. రాజకీయ దురుద్దేశాలకు తావులేకుండా గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులకు అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు. **తాటిపాముల అభివృద్ధికి కృషి** అధికారంలో ఉన్నా లేకున్నా తన తండ్రి కోరిక మేరకు తాటిపాముల గ్రామాన్ని తన శక్తి మేర అభివృద్ధి చేస్తానని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి తన వంతు కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# నవరాత్రి శోభతో సిరుల తొర్రూర్

- ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం
- సర్వపాపాలను హరించే లంబోదరుడికి భక్తుల మంగళ నీరాజనాలు
- నిమజ్జనం విజయవంతం: రాష్ట్రంపై బొజ్జ గణపయ్య ఆశీస్సులుండాలని ఆకాంక్ష
- తొలి అక్షరం రాష్ట్ర బ్యూరో సీనియర్ జర్నలిస్ట్ పస్తం సాంబ








**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి(సాంబ పస్తం) సెప్టెంబర్ 23:** తొర్రూర్ పట్టణ కేంద్రంలో గత పది రోజులుగా అత్యంత వైభవంగా,ఆధ్యాత్మిక ఉత్సాహంతో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. 10 వ రోజు పురస్కరించుకుని పట్టణంలోని వివిధ మండపాల వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించిన అనంతరం భక్తజనం జయజయధ్వానాల నడుమ వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో పూర్తి చేశారు. **రాష్ట్రమంతటా ఆధ్యాత్మిక నామస్మరణ** తొర్రూర్ పట్టణంలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా బుధవారం రోజున గణేష్ నిమజ్జనోత్సవాలు కోలాహలంగా జరిగాయి. "గణపతి బప్పా మోరియా..మంగళ మూర్తి మోరియా" అనే నామస్మరణతో పట్టణ వీధులన్నీ మారుమోగాయి. సమస్త ప్రజానీకానికి, రాష్ట్ర సస్యశ్యామలానికి ఆ విఘ్నేశ్వరుడి దివ్య ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని భక్తులు, ప్రతినిధులు ఈ సందర్భంగా ఆకాంక్షించారు. **ప్రత్యేక ఆకర్షణగా ప్రతినిధుల పూజాధికాలు** ఈ నిమజ్జనోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రముఖుల విగ్రహాల నిమజ్జనం ప్రత్యేకంగా సాగింది. నిమజ్జనం చేసిన ప్రముఖుల జాబితాలో 'తొలి అక్షరం' రాష్ట్ర బ్యూరో & తొర్రూర్ ప్రతినిధి పస్తం సాంబ లక్ష్మి తమ నివాసంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో, కోలాహలంగా తీసుకెళ్లి శాస్త్రోక్తంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పస్తం సాంబ మాట్లాడుతూ తొర్రూర్ ప్రజలందరికీ గణనాథుడి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. నెరవేరిన వేడుకలు శోభాయమానంగా ముగింపు తొర్రూర్ పట్టణంలోని ప్రధాన రథవీధుల గుండా ఊరేగింపులు సాగాయి. తీన్మార్ డప్పులు, ఆధ్యాత్మిక భజనలు, యువతల కోలాటాలు, రంగుల చల్లుకాల నడుమ గణనాథులు నిమజ్జన ప్రాంతానికి చేరుకున్నాయి. అధికారులు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గట్టి పోలీసు భద్రత, లైటింగ్, క్రేన్ల ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తుల ఆనందోత్సాహాల మధ్య, వచ్చే ఏడాది త్వరగా రావాలని కోరుకుంటూ బొజ్జ గణపయ్యకు వీడ్కోలు పలికారు. ఈ నిమజ్జనలో పస్తం సైదులు, కిన్నెర చిన్న గురవయ్య, తుర్పాటి శివగోపాల్, తూర్పాటి శీను, నర్కుటి అబ్బ స్వామి,పస్తం రిషి,పస్తం యశ్వంత్, బంధుమిత్రులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

# రైతులు తప్పనిసరిగా ఫార్మర్ ఐడీ నమోదు చేసుకోవాలి

- నెల్లికుదురు మండలం అన్ని గ్రామాల రైతులు





**తొలి అక్షరం/నెల్లికుదురు సెప్టెంబర్ 23:** రైతు పథకాలు, మద్దతు ధర, ఎరువులు, పంట రుణాలు తదితర ప్రభుత్వ వ్యవసాయ సేవలు, పథకాల ప్రయోజనాలు పొందేందుకు రైతులు తప్పనిసరిగా ఫార్మర్ ఐడీ నమోదు చేసుకోవాలని నెల్లికుదురు మండల వ్యవసాయ అధికారి బి.మహేందర్ తెలిపారు. రైతుల సౌకర్యార్థం సెప్టెంబర్ 22 నుంచి 30వ తేదీ వరకు ప్రత్యేక ఫార్మర్ ఐడీ నమోదు క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటివరకు ఫార్మర్ ఐడీ నమోదు చేసుకోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫార్మర్ ఐడీ నమోదు చేసుకునేందుకు రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ ఫోన్ తీసుకుని సమీపంలోని రైతు వేదికలోని ఏఈఓలను లేదా మీ–సేవ కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, సేవలను రైతులకు మరింత సులభంగా అందించేందుకు ఫార్మర్ ఐడీ నమోదు కీలకమని బి . మహేందర్ పేర్కొన్నారు. మండలంలోని అర్హులైన ప్రతి రైతు ఫార్మర్ ఐడీ నమోదు చేసుకునేలా ఏఈఓలు సమన్వయంతో రైతులకు అవగాహన కల్పిస్తూ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రైతులందరూ సెప్టెంబర్ 22 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే ప్రత్యేక క్యాంపెయిన్‌లో పాల్గొని ఫార్మర్ ఐడీని తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి . మహేందర్ కోరారు.

# వరద పరిస్థితులపై పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- వరద పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ
- 24 గంటల పాటు అందుబాటులో కంట్రోల్ రూమ్
- అత్యవసర పరిస్థితుల్లో వెంటనే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలి
- టోల్‌ఫ్రీ నంబర్: 1077, సెల్ నంబర్ 9063211298

**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి సెప్టెంబర్– 23:** అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లాస్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వాగులు, వంకలు, చెరువులు, ప్రాజెక్టులు, కాలువలు తదితర ప్రాంతాల్లో నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముంపునకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, పరిస్థితిని బట్టి అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. వరద నీటి ప్రవాహం అధికంగా ఉన్న వాగులు, వంకలు, కాలువలు, చెరువులు, నదులను దాటేందుకు ప్రజలు ప్రయత్నించ రాదని కలెక్టర్ సూచించారు. వరద నీటిలో వాహనాలతో ప్రయాణించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలు, నీట మునిగిన ప్రాంతాలు తదితర ప్రమాదకర ప్రాంతాలకు ప్రజలు దూరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రహదారులపై వరద నీరు ప్రవహిస్తున్న ప్రాంతాల్లో రాకపోకలను పర్యవేక్షించి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, మున్సిపల్, నీటిపారుదల, వైద్య, విద్యుత్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు వరదలకు సంబంధించిన ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని కలెక్టర్ కోరారు. కంట్రోల్ రూమ్‌కు అందిన సమాచారంపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నంబర్: 1077, కంట్రోల్ రూమ్ సెల్ నంబర్: 9063211298 ప్రజలు ఈ నంబర్లను వినియోగించుకొని వరద పరిస్థితులు, అత్యవసర సమస్యలపై సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# మానవ మనుగడ కొనసాగాలి అంటే పర్యావరణ పరిరక్షణయే ముఖ్యం



- అప్పలరావుపేట హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బూరుగుపల్లి శ్రవణ్ కుమార్



**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 23:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని నెక్కొండ మండలం అప్పలరావుపేట హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు బూరుగుపల్లి శ్రవణ్ కుమార్ అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మాకే నామ్ ఏక్ పేడ్ 3.0 కార్యక్రమంలో భాగంగా నెక్కొండ మండలం అప్పలరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ముమ్మరంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఒక్కో విద్యార్థి ,ఉపాధ్యాయుడు స్వచ్ఛందంగా మూడేసి మొక్కల చొప్పున నాటి వాటిని సంరక్షించాలని నిర్ణయించారు. జామ, సీతాఫలం, నేరేడు ,మలబార్ పండ్ల మొక్కలు, మందార, గన్నేరు , మల్లె,సన్న జాజి, నూరువరాలు, నీడను , ప్రకృతి అందాన్ని పెంచే గుల్ మహర్,కానుగ మొక్కలను నాటారు. అనంతరం జరిగిన సమావేశంలో హెచ్ఎం శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛ హరిత విద్యాలయం 2026 కార్యక్రమాన్ని పాఠశాలలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నమన్నారు. ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణకు విద్యార్థులు చొరవ చూపాలని కోరారు. ప్రకృతికి హాని చేసే వ్యర్థాలను సేకరించి నిర్దిష్ట పద్ధతిలో తరలించాలని కోరారు. మొక్కలను విరివిగా పెంచి భూతాపాన్ని తగ్గించుకోవాలని సూచించారు. విద్యార్థులు వారి తల్లి పేరిట మాతృ వాత్సల్యాన్ని చాటుతూ మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు సౌరపు యాకయ్య, మాటేటి దయాకర్, తేజావత్ రమేష్, భూక్యా సునీత, అంగన్వాడి టీచర్లు సుజాత మహేశ్వరి ఆయాలు రమాదేవి వెంకటలక్ష్మి తో పాటు విద్యార్థులు ,వారి తల్లులు పాల్గొన్నారు.

# రామన్నపేట ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో ఆయుర్వేద దినోత్సవ వేడుకలు




**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 23:** రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో ఆయుర్వేద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం మరియు యోగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ నుస్రత్ మాట్లాడుతూ.. ఆయుర్వేదం మన పురాతన సంపద అని, ఆయుర్వేదాన్ని, యోగాను జీవన విధానంలో భాగం చేసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని వివరించారు. ఆయుర్వేద మందులు ప్రకృతి సిద్ధంగా తయారవుతాయని, వీటివల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని తెలిపారు. యోగా ఇన్‌స్ట్రక్టర్ సైదులుయోగాసనాలు, ప్రాణాయామం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ ఆసనాలు వేసి చూపించారు. ఈ కార్యక్రమంలో SNO ప్రవీణ్ తో పాటు సిబ్బంది మరియు పలువురు పేషెంట్లు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన బాల్యం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**ఐసిడిఎస్ సూపర్వైజర్ ధనమ్మ కక్కిరేణి గ్రామంలో ఘనంగా పోషణ మాసం**



**తొలి అక్షరం/రామన్నపేట, సెప్టెంబర్ 23:** ఆరోగ్యకరమైన బాల్యం కోసం ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ ధనమ్మ సూచించారు. బుధవారం రామన్నపేట మండలం కక్కిరేణి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణ మాసం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ చిల్ల మధురవేణి సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రం ద్వారా అందిస్తున్న పోషకాహారం, దాని పోషక విలువలు, వ్యక్తిగత పరిశుభ్రత, ఆహార పదార్థాల వినియోగంపై గర్భిణీలు, బాలింతలు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ ధనమ్మ మాట్లాడుతూ..అంగన్వాడీ కేంద్రాలు కేవలం పిల్లలకు ఆహారం అందించే కేంద్రాలు మాత్రమే కాకుండా, పిల్లల ఆరోగ్యానికి పునాది వేసే వేదికలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తొలి అడుగుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. "ఒక్కరోజు పోషకాహారం కాదుడ ప్రతిరోజూ సరైన పోషణే ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బలం" అని తెలిపారు. ప్రతి కుటుంబం పోషణపై అవగాహన పెంచుకుని, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కేతమ్మ, అంగన్వాడీ టీచర్లు వీ. ఉమ, పీ. సుధ, సీహెచ్. యశోద,టి. మల్లిక, ఆశా కార్యకర్తలు కవిత, సూర్యకళ, సామాజిక కార్యకర్త వేముల సైదులు, గర్భిణీలు, బాలింతలు, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య వినాయక మండపం లడ్డు వేలంలో రూ.40,116లకు లడ్డును దక్కించుకున్న మాజీ సర్పంచ్ దంపతులు



**తొలి అక్షరం / రామన్నపేట సెప్టెంబర్ 23:** రామన్నపేట మండల కేంద్రంలోని ఆర్యవైశ్య వినాయక మండపం వద్ద నిర్వహించిన లడ్డు వేలం పాట కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేలం పాటలో లక్ష్మాపురం మాజీ సర్పంచ్ ఉప్పు ప్రకాష్ – ఉప్పు విజయలక్ష్మి దంపతులు రూ. 40,116/–లకు వినాయకుని లడ్డును వేలంలో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారిని ఘనంగా సత్కరించారు. వినాయక మండపం వద్ద భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఈ నెల 24 నుండి 26 వరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు చివరి అవకాశం

- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి రవిబాబు

**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి సెప్టెంబర్- 23:** 2026-27 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఇంటర్మీడియట్ కళాశాలల్లో మొదటి సంవత్సరం చేరాలనుకునే విద్యార్థులకు రాష్ట్ర ఇంటర్ బోర్డు ఈ నెల 24 నుండి 26 వరకు చివరి అవకాశాన్ని కల్పించినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కె. రవిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 24వ తేదీ నుండి 26వ తేదీ వరకు అడ్మిషన్ల ప్రక్రియ ముగియనుండటంతో, విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనిజిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## సెప్టెంబర్ 27న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు: జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి జ్యోతి

**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి సెప్టెంబర్- 23:** సెప్టెంబర్ 27న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఖమ్మం లకారం ట్యాంక్ బండ్ వద్ద ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద జయంతి వేడుకలు సెప్టెంబర్ 27న ఉదయం 9 గంటలకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని బీసి అభివృద్ధి అధికారిణి జ్యోతి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## సెప్టెంబర్ 26న వీరనారి చాకలి ఐలమ్మ జయంతి: జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి జ్యోతి

**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి సెప్టెంబర్- 23:** సెప్టెంబర్ 26 న వీరనారీ చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.స్థానిక వైరా రోడ్డులోని ప్రభుత్వ వైద్య కళాశాల ఎదురుగా ఉన్న వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద జయంతి వేడుకలు సెప్టెంబర్ 26న ఉదయం 9 గంటలకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని బీసి అభివృద్ధి అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## గార్ల ఒడ్డులో లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం

- వివిధ టెండర్లు, బహిరంగ వేలానికి ప్రకటన
- అక్టోబర్ 1న ఉదయం 11 గంటలకు ప్రక్రియ



**తొలి అక్షరం/ఏన్కూర్ సెప్టెంబర్ 23:** గార్ల ఒడ్డులోని శ్రీశ్రీశ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో వివిధ సేవలు, దుకాణాలు, వస్తువుల నిర్వహణకు సంబంధించి టెండర్లు, బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు దేవస్థానం అధికారులు ప్రకటించారు. 2026 అక్టోబర్ 1వ తేదీ ఉదయం 11 గంటలకు టెండర్లు/వేలం ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు.రెండు సంవత్సరాల కాలపరిమితితో నిర్వహించనున్న బహిరంగ వేలంలో పలు అంశాలను చేర్చారు. కొబ్బరికాయలు, పూజా సామగ్రికి రూ.50 వేలు, ఫ్యాన్సీబొమ్మల దుకాణానికి రూ.30 వేలు, పాలుబెల్లంబియ్యం ప్రోగుచేసుకునే హక్కుకు రూ.10 వేలు, కొబ్బరి చిప్పలు ప్రోగుచేసుకునే హక్కుకు రూ.10 వేలు, పాలపొంగలి షెడ్‌కు గ్యాస్ సరఫరాకు రూ.30 వేలు, కూల్‌డ్రింక్స్‌మినరల్ వాటర్‌కు రూ.10 వేలుగా కనీస ధరలను నిర్ణయించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.ఆసక్తి ఉన్న వ్యక్తులు దేవస్థానం నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత విధానంలో పాల్గొనాలని అధికారులు సూచించారు. వేలం/టెండర్‌కు సంబంధించిన పైకాన్ని డీడీ రూపంలో సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలు దేవస్థానం కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

## ఇంద్రపాలనగరంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం





**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 23:** శ్రీ శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద నెలకొల్పిన గణనాథుని వద్ద అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం జాక్ రాష్ట్ర కార్యదర్శి, సర్పంచ్ గర్దాస్ విక్రమ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.దాతలు:మందడి విద్యాసాగర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి బ్రదర్స్, రవ్వ రేణుక - నర్సింహా, రాస వరలక్ష్మి - వెంకటేష్, సింగణబోయిన పార్వతమ్మ - జంగయ్య, నక్క పద్మ - వెంకటేష్ లు అన్నదానానికి సహకరించారు. ఈ కార్యక్రమంలో సింగణబోయిన గణేష్, మాజీ సర్పంచ్ కాటపెల్లి సిద్దమ్మ - యాదయ్య, ఉప సర్పంచ్ నల్ల జయసుధ - స్వామి, పాల సంఘం చైర్మన్ కంబాలపల్లి శ్రీశైలం, పాల సంఘం డైరెక్టర్ రాజన్నగారి మురళి, నిమ్మగడ్డ పద్మారావు, సింగణబోయిన మల్లేశం, కమిటీ సభ్యులు పగుడాల వేణుగోపాల్, తవుటం బిక్షపతి, పల్లపు దుర్గయ్య, జోగు నర్సింహా, పగుడాల వెంకటేష్, గ్రామ ప్రజలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు 50% ఫీజు రాయితీని వెంటనే అమలు చేయాలి

- జీవోలు కాగితాలకే పరిమితం కావడందారుణం
- అధికారులు తక్షణమే విద్యాసంస్థలను ఆదేశించాలి
- టిడబ్ల్యూజేఎఫ్ హెచ్ 2843 అధ్యక్ష కార్యదర్శులు నానబాల రామకృష్ణ ,అర్వపల్లి నగేష్ డిమాండ్




**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి సెప్టెంబర్- 23:** సమాజ శ్రేయస్సు కోసం, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రాత్రీ పగలు శ్రమిస్తున్న విలేకరులు, (పాత్రికేయుల) సంక్షేమాన్ని విద్యాసంస్థలు, అధికారులు పూర్తిగా విస్మరిస్తున్నారని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ హెచ్ 2843 యూనియన్ తీవ్రంగా ఖండించింది.ప్రభుత్వం జర్నలిస్టుల పిల్లలకు స్కూళ్లు, కాలేజీలు మరియు ప్రొఫెషనల్ కోర్సుల ఫీజుల్లో కల్పించిన 50 % శాతం రాయితీ సదుపాయం క్షేత్రస్థాయిలో ఏమాత్రం అమలు కావడం లేదని యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ హెచ్-2843) యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు నానబాల రామకృష్ణ,అర్వపల్లి నగేష్ మాట్లాడుతూ సమాజంలో నాలుగో స్తంభంగా ఎటువంటి జీతభత్యాలు లేకుండా పనిచేస్తూ, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న జర్నలిస్టుల కుటుంబాలకు ఈ ఫీజు రాయితీ ఎంతో ఊరటనిచ్చే విషయమని పేర్కొన్నారు.కానీ చాలా ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలు,కళాశాలల యజమాన్యాలు ఈ రాయితీని అమలు చేయడానికి నిరాకరిస్తున్నాయని ఆరోపించారు.సంబంధిత అక్రిడేషన్ కార్డులు చూపించినప్పటికీ, జీవో కాపీలు అందించినప్పటికీ యజమాన్యాలు రకరకాల కారణాలతో పూర్తి ఫీజులు చెల్లించాల్సిందేనని జర్నలిస్టుల పై ఒత్తిడి తెస్తున్నాయని మండిపడ్డారు.ప్రభుత్వం జీవోలు జారీ చేసి చేతులు దులుపుకుందే తప్ప, వాటి అమలుతీరును సమీక్షించడంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉన్నత విద్యాశాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే విద్యాసంస్థల యజమాన్యాలు ఈ రకమైన మొండి వైఖరిని ప్రదర్శిస్తున్నాయని అన్నారు.ఫీజు రాయితీ అనేది జర్నలిస్టుల హక్కు అని, దానిని కాగితాలకే పరిమితం చేయడం సరైంది కాదని హితవు పలికారు.ఈ విషయమై అధికారులు తక్షణమే స్పందించి,రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని గుర్తింపు పొందిన పాఠశాలలు,జూనియర్ కళాశాలలు,డిగ్రీ, వృత్తి విద్యా సంస్థలకు 50% రాయితీ కి సంబంధించిన నిబంధనలను గుర్తుచేస్తూ మరోసారి స్పష్టమైన సర్క్యులర్,ఆదేశాలు పంపాలని( టిడబ్ల్యూజేఎఫ్ హెచ్ 2843 ) టిడబ్ల్యూజేఎఫ్ ( హెచ్ -2843) యూనియన్ తరఫున విజ్ఞప్తి చేశారు.నిబంధనలు ధిక్కరించే విద్యాసంస్థల పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.లేకపోతే రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులందరి నీ ఏకం చేసి, జిల్లా కలెక్టరేట్లు మరియు విద్యాశాఖ కార్యాలయాల ముట్టడికి సమాయత్తమవుతామని, ప్రజాందోళన తీవ్రతరం చేస్తామని టిడబ్ల్యూజేఎఫ్ హెచ్ 2843 నాయకులు స్పష్టం చేశారు. ఈ సమస్యపై ప్రభుత్వం,విద్యాశాఖ తక్షణమే స్పందించి జర్నలిస్టుల పిల్లలకు 50% రాయితీ అందేలా చూసి న్యాయం చేయాలని టిడబ్ల్యూజేఎఫ్ హెచ్-2843 మామిడి సోమయ్య యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు నానబాల రామకృష్ణ,అర్వపల్లి నగేష్ కోరడం జరిగింది

# భక్తులు, ఉత్సవ కమిటీల సహకారంతో నవరాత్రి ఉత్సవాలు విజయవంతం

- పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య
- నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు, పోలీసుల నిరంతర పర్యవేక్షణ
- భక్తుల భద్రతకు పటిష్ట ఏర్పాట్లతో ప్రశాంతంగా గణేష్ నిమజ్జన వేడుకలు







**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి సెప్టెంబర్- 23:** గణేష్ నవరాత్రి ఉత్సవాలను తొమ్మిది రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికార యంత్రాంగం, పోలీస్ శాఖకు సహకరించిన భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ధన్యవాదాలు తెలిపారు. భక్తుల సమన్వయం, ఉత్సవ కమిటీల సహకారం, వివిధ శాఖల అధికారుల భాగస్వామ్యంతో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు ఆయన అన్నారు.బుధవారం స్థానిక ముస్తఫానగర్ చౌరస్తా వద్ద గణేష్ నిమజ్జన శోభాయాత్రను పోలీస్ కమిషనర్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక మంత్రుల ఆదేశాల మేరకు గణేష్ నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో వివిధ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.నిమజ్జనం కోసం ప్రత్యేక ఘాట్ సిద్ధం చేసినట్లు తెలిపారు. నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని, అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రతా చర్యలు, ప్రజలకు మార్గనిర్దేశం చేసే ఏర్పాట్లపై దృష్టి సారించినట్లు వివరించారు.గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో ప్రజా ప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు చురుగ్గా పాల్గొంటూ తమ సహకారం అందించారని అన్నారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ, పోలీస్ శాఖ సూచనలను పాటించిన భక్తులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.నిమజ్జనం పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది, పోలీసుల నిరంతర పర్యవేక్షణ తో,గణేష్ విగ్రహాల నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉంటుందని పోలీస్ కమిషనర్ తెలిపారు. అనంతరం ధంసలాపురం చెరువు వద్ద తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణేష్ నిమజ్జన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, భక్తుల రాకపోకలు, శోభాయాత్ర నిర్వహణ, భద్రతా చర్యలను వారు స్వయంగా పర్యవేక్షించి, నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో స్తంభాద్రి ఉత్సవ సమితి ప్రెసిడెంట్ వినోద్ లహోటి, వర్కింగ్ ప్రెసిడెంట్ జి. విద్యాసాగర్, జనరల్ సెక్రటరీ కె. జయపాల్ రెడ్డి, కన్వీనర్ కన్నం ప్రసన్న కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ అల్లిక అంజయ్య, ట్రెజరర్ ఎం. శ్రీహరి, సెక్రటరీ దోవెల సాయికిరణ్, వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఆరుతడి పరిస్థితుల్లోనూ పత్తికి మంచి ఎదుగుదల





**- గుబ్బగుర్తిలో రాశి సీడ్స్ 'షిఫ్ట్' విత్తనాలపై రైతులకు అవగాహన**

**తొలి అక్షరం/కొనిజర్ల సెప్టెంబర్ 23:** ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో రాశి సీడ్స్ ఆధ్వర్యంలో 'షిఫ్ట్' పత్తి విత్తనాల ఫీల్డ్ డే సందర్భంగా రైతు అవగాహన సదస్సు, పత్తి క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. రైతు వచ్చువాయి చెన్నయ్య పొలంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దొడ్డిగళ్ల బాలాజీతో పాటు రాశి సీడ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.ప్రస్తుత వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పత్తి సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులు, కంపెనీ ప్రతినిధులు వివరించారు. తేమ సంరక్షణ, సరైన ఎరువుల వినియోగం, చీడపీడల నియంత్రణ వంటి యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా పంటను మెరుగ్గా నిర్వహించుకోవచ్చని సూచించారు.రైతులు విత్తనాలను ఎంపిక చేసుకునే ముందు స్వయంగా క్షేత్రాలను సందర్శించి, పంట పనితీరును పరిశీలించాలని సూచించారు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రచార సమాచారాన్ని మాత్రమే ఆధారంగా చేసుకుని విత్తనాల ఎంపిక చేయవద్దని, క్షేత్రస్థాయి పనితీరును పరిశీలించడం ముఖ్యమని తెలిపారు.ఆరుతడి పరిస్థితుల్లో కూడా 'షిఫ్ట్' పత్తి విత్తనం మంచి ఎదుగుదలతో పాటు అధిక కాయల ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందని రాశి సీడ్స్ ప్రతినిధులు వివరించారు. శాస్త్రీయ పద్ధతుల్లో పత్తి సాగు చేస్తూ నాణ్యమైన విత్తనాలను వినియోగించాలని రైతులకు సూచించారు. మండల వ్యవసాయ అధికారి దొడ్డిగళ్ల బాలాజీ, రాశి సీడ్స్ రీజినల్ బిజినెస్ మేనేజర్ రమణ కుమార్, సేల్స్ మేనేజర్ పవన్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

# ప్రజల కోసం పనిచేసిన కమ్యూనిస్టులు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ
- ప్రజా పోరాటాలే పబ్బతి లింగయ్యకు ఘన నివాళి
- మాజీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు
- శోభనాద్రిపురంలో సీపీఎం సీనియర్ నాయకుడు పబ్బతి లింగయ్యకు ఘన నివాళి








**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 23:** రామన్నపేట మండల ఉద్యమంలో ఐదు దశాబ్దాలుగా అలుపెరుగని పోరాటం సాగించి, అనేక ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించిన సీపీఎం సీనియర్ నాయకుడు, రామన్నపేట మాజీ వైస్ ఎంపీపీ పబ్బతి లింగయ్య అనారోగ్యంతో మృతి చెందడం పార్టీకి, ప్రజా ఉద్యమానికి తీరని లోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు.శోభనాద్రిపురం గ్రామంలో పబ్బతి లింగయ్య భౌతికకాయానికి పూలమాల వేసి నివాళు లర్పించిన అనంతరం నిర్వహించిన సంతాప సభలో జాన్ వెస్లీ మాట్లాడుతూ.. ప్రజల కోసం పనిచేసిన కమ్యూనిస్టులు మరణించిన తర్వాత కూడా ప్రజల మధ్య చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు.చిన్ననాటి నుంచి చివరి వరకు తాను నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతానికి కట్టుబడి, చేతబట్టిన ఎర్రజెండాను విడిచిపెట్టకుండా పబ్బతి లింగయ్య ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడారని తెలిపారు. గీత కార్మిక సంఘం నాయకుడిగా కల్లుగీత కార్మికులకు చెట్లు అందుబాటులో ఉండాలని, తాడిచెట్లపై పన్నును రద్దు చేయాలని, జీతగాళ్లు, కూలీలను సంఘటితం చేసి వారి హక్కుల కోసం పోరాటాలు నిర్వహించారని గుర్తుచేశారు.రామన్నపేట మండలంలో నెలకొన్న అనేక ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్వహించి ప్రభుత్వాలను కదిలించిన నాయకుడు పబ్బతి లింగయ్య అని అన్నారు. ఆయన ఆశయాలు, స్ఫూర్తితో ప్రభుత్వాలు అవలంబించే ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలను సమీకరించి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. **ప్రజా పోరాటాలే పబ్బతి లింగయ్యకు ఘన నివాళి**మాజీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం ఉద్యమించడమే పబ్బతి లింగయ్యకు మనం అందించే ఘన నివాళి అన్నారు. ప్రజల పక్షాన నిరంతరం నిలిచిన లింగయ్య మరణం పార్టీకి, ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు.గ్రామంలో అనేక ఆటుపోట్లు, నిర్బంధాలను ఎదుర్కొంటూ ధైర్యంగా ఉద్యమాలకు నాయకత్వం వహించారని తెలిపారు. అనేక మంది కమ్యూనిస్టు కార్యకర్తలను తీర్చిదిద్ది, వారిని ప్రజా ప్రతినిధులుగా గెలిపించడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు.రామన్నపేట వైస్ ఎంపీపీగా బాధ్యతలు నిర్వహిస్తూ గ్రామ అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. మహానాయకుడు పుచ్చలపల్లి సుందరయ్యను శోభనాద్రిపురం గ్రామానికి తీసుకొచ్చి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించడంలో పబ్బతి లింగయ్య కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబించే ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పబ్బతి లింగయ్య స్ఫూర్తితో ప్రజలను సమీకరించి ఉద్యమాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఆటపాటలతో ప్రజానాట్యమండలి నివాళిప్రజానాట్యమండలి కళాకారులు ఆటపాటలు, అమరవీరుల గీతాలతో పబ్బతి లింగయ్య అంతిమయాత్రలో పాల్గొని ఘన నివాళులర్పించారు.పాడె మోసిన జిల్లా నాయకత్వం రామన్నపేట మండల కమ్యూనిస్టు ఉద్యమంలో పెద్దదిక్కుగా నిలిచి, అనేక మంది కార్యకర్తలను తీర్చిదిద్దిన పబ్బతి లింగయ్య పాడెను సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.డి. జహంగీర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం తదితర నాయకులు పాడే మోసి కడసారి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి. జహంగీర్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు బొంతల చంద్రారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహా, పైళ్ల ఆశయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య, కల్లూరి మల్లేశం, చిట్యాల మాజీ జడ్పీటీసీ, గీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు పావునుగుళ్ల అచ్చాలు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాగిరి కిష్టయ్య, బొలగాని జయరాములు, జిల్లా కమిటీ సభ్యులు సిరిపంగి స్వామి, వనం ఉపేందర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బుర్రు అనిల్ కుమార్, మండల కార్యదర్శివర్గ సభ్యులు బోయిని ఆనంద్, కల్లూరి నగేష్, కందుల హనుమంతు, మాజీ వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, నీల ఐలయ్య, ఎం.డి. రషీద్, బొడిగె రజిత, గోగు లింగస్వామి, ఉపసర్పంచ్ ముక్కామల మల్లేశం, పుట్టల ఉదయ్ కుమార్, కొమ్ము అంజయ్య, సంగి లింగస్వామి, బీంపాక ప్రశాంత్ పాల్గొన్నారు.

# హలో ఉద్యమకారుడ చలో యాదగిరిగుట్ట




**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 23:** ఉద్యమ కారుల ఫోరం 9వ వార్షికోత్సవాన్ని లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం సన్నిధిలో నిర్వహించుటకు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు యాదగిరిగుట్టలోని లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్లో జరగబోయే సమావేశానికి రాష్ట్రంలోని నలుమూలల నుండి 33 జిల్లాల ఉద్యమకారులు ఉద్యమ కారినీలు తరలివచ్చి ఉద్యమకారుల ఫోరం సమావేశాన్ని విజయవంతం చేయాలని గత తొమ్మిది సంవత్సరాల క్రితం ప్రారంభించిన ఉద్యమకారులను ఫోరం ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి ఉద్యమకారులను ఏకం చేసి ఉద్యమ స్ఫూర్తిని చాటిన ఉద్యమకారుల ఫోరం 9 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటం చేసి వేలాది మంది ఉద్యమకారులకు అండగా నిలిచి ఉద్యమ కమిటీ ఏర్పాటు చేయడానికి ముఖ్యపాత్ర వహించి హైకోర్టును ఆశ్రయించి విజయం సాధించిన ఘనత ఉద్యమకారుల దేనాని ఈ సమావేశం ఉదయం పదకొండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తారని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న ఒక పత్రిక ప్రకటనలో తెలియజేశారు

# నకిరేకల్‌లో బిచ్చనపల్లి ప్రకాష్ రావు సంతాప సభ



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 23:** నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంతాప సభ ఘనంగా జరిగింది.ప్రముఖుడు, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి అయిన బిచ్చనపల్లి ప్రకాష్ రావు చిత్రపటానికి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రకాష్ రావు చేసిన సేవలను, సమాజానికి అందించిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# రామన్నపేటలో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు





**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 23:** గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రామన్నపేట మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు బండ మధుకర్ రెడ్డి సందర్శించారు గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండపాల వద్ద నిర్వహించిన అన్నదానంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో అక్కెనపల్లి ప్రవీణ్, దావనూరు వెంకటేష్, బాకూరి శివకుమార్, సింగు శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో గణేష్ అన్నదానం.. భక్తులకు అన్నప్రసాదం వడ్డించిన ఎమ్మెల్సీ శంకర్ నాయక్



**తొలి అక్షరం/మిర్యాలగూడ /సెప్టెంబర్23:** వేములపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. కాంగ్రెస్ పార్టీ వార్డు మెంబర్ బొంగర్ల సుకన్యవినోద్ ఆధ్వర్యంలో అన్నదాన ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం స్వయంగా భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించి, గణేష్ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రెగట్టి రవీందర్ రెడ్డి, ఎస్సై డి.వెంకటేశ్వర్లు, టీపీసీసీ సభ్యుడు చిరుమరి క్రిష్ణయ్య, స్థానిక సర్పంచ్ పుట్టల సందీప్, వార్డు సభ్యులు మాతంగి సుధీర్, ఎస్.కె. హాజీ, నవీద్, రావు ఎల్లారెడ్డి, పుట్టల కృపయ్య, గంజి శ్రీనివాస్, చల్లా వెంకట్ రెడ్డి, చక్ర టీవీ అధినేత కొండా లక్ష్మణ్, పుట్టల పెద్ద వెంకన్న, మాతంగి చంటి, దైద గిరి, పగడాల వెంకన్న, కోట వెంకన్న తదితరులు పాల్గొన్నారు.గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పందిరి రవి, చిట్టిపల్లి బాలకృష్ణ, పగడాల రాకేష్, రేవంత్, సుమంత్, వెంకటేష్, చందు, శ్రీనుతో పాటు గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.గణేష్ ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమం భక్తుల ఐక్యతకు, ఆధ్యాత్మిక స్ఫూర్తికి ప్రతీకగా నిలిచింది.



# రామన్నపేటలో మేకల దొంగల ముఠా అరెస్ట్ - నలుగురు అరెస్ట్




**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 23:** రామన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మేకల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు.నిడానపల్లి గ్రామంలో ఈ నెల 20వ తేదీ రాత్రి మేక దొంగతనం జరిగినట్లు బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో భాగంగా ఈరోజు జనంపల్లి క్రాస్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా మేకల దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు.అరెస్ట్ అయిన నిందితులు:సాంపంగి వెంకన్న (60), అలీనగర్, ఇబ్రహీంపేట సాంపంగి శారద (44), అలీనగర్, ఇబ్రహీంపేట ఎమ్మెడ్డి శ్రీనివాస్ రెడ్డి (48), గూడాపూర్, మునుగోడు గుంజ గోపి (52), రామ్ నగర్ బజార్, నిడమనూరునిందితుల వద్ద నుండి రూ.10,000 నగదు, ఒక సెల్ ఫోన్, దొంగతనానికి ఉపయోగించిన స్విఫ్ట్ కారు (టూా 09 దీు 3128) ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.నిందితులపై గతంలో కూడా పలు దొంగతనం కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ జి. సతీష్ తెలిపారు.

# రైతులకు నీళ్లివ్వని కాంగ్రెస్ పాలన.. శాపంగా మారింది: ఎమ్మెల్సీ కోటిరెడ్డి ఫైర్

సాగర్ కాలువలో నీళ్లు బంద్.. కాంగ్రెస్ ప్రభుత్వంపై భూపాల్‌రెడ్డి, భాస్కర్‌రావు తీవ్ర ఆగ్రహం

నీళ్లు లేవు.. కరెంట్ లేదు.. రైతుల పరిస్థితి దయనీయం: కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ నేతల ఘాటు విమర్శలు



**తొలి అక్షరం/మిర్యాలగూడ/ సెప్టెంబర్ 23:** వేములపల్లి :కాంగ్రెస్ ప్రభుత్వ పాలన రైతులకు శాపంగా మారిందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి మాజీ ఎమ్మెల్యేలు భూపాల్ రెడ్డి, భాస్కర్ రావు విమర్శించారు.వేములపల్లి మండల కేంద్రంలో బుధవారం సాగర్ ఎడమ కాలువ పరిధిలో నిలిపివేయడంతో నిరసన వ్యక్తం చేయడం జరిగింది. వారు మాట్లాడుతూ గణేష్ నవరాత్రుల సందర్భంగా పూజలు అందుకున్న గణేశుడునీ నిమజ్జనం చేయదలచుకున్న భక్తులకు నీటిని నిలుపుదల చేయడంతో ప్రభుత్వ అధికారుల అలసత్వానికి నిరాశే మిగిలిందని అన్నారు.అలాగే మరో వారం పది రోజులు నీటిని విడుదల చేస్తే స్థానిక రైతుల పంటలకు ఎంతో ఉపయోగపడేవని అన్నారు.రేవంత్ ప్రభుత్వం నీటిని అందివ్వకపోగా కరెంటును కూడా సక్రమంగా ఇవ్వకపోవడంతో బోర్ల కింది రైతులు నీరు అందక నానా అవస్థలకు గురవుతున్నారని చెప్పుకొచ్చారు. విద్యుత్ సమస్యలపై గురువారం నిర్వహించే ధర్నాకు రైతులు స్థానిక ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల నాయకుడు చిర్ర మల్లయ్య యాదవ్, మాడుగులపల్లి మండల అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య,స్థానిక సర్పంచ్ పుట్టల సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కొణిజర్లలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

- 24న ఎస్సీ కమిటీ హాల్‌లో నిర్వహణ

**తొలి అక్షరం/కొణిజర్ల సెప్టెంబర్ 23:** పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ నెల 24న గురువారం కొణిజర్ల ఎస్సీ కమిటీ హాల్‌లో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక నిర్వహించనున్నట్లు మండల మాజీ అధికార ప్రతినిధి కొర్లకంటి రవికుమార్ మాదిగ తెలిపారు. కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి కందికట్ల విజయ్ మాదిగ, ఎంఎస్పీ మాజీ జిల్లా అధ్యక్షుడు తురుగంటి అంజయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్ మాదిగ హాజరుకానున్నారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరై ఎన్నికను విజయవంతం చేయాలని రవికుమార్ కోరారు.

# శబరిమల పాదయాత్రకు పల్లె బ్రదర్స్ రూ.1.10 లక్షల విరాళం

- అయ్యప్ప స్వాముల పాదయాత్రకు పల్లె బ్రదర్స్ ఆర్థిక సహాయం
- శబరిమల మహా పాదయాత్రకు పల్లె బాలేశ్వర్ విరాళం



**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్ 23:** శ్రీ రుద్ర ఆర్యనాథన్ గోసేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గురుస్వామి సత్యనారాయణ రెడ్డి నేతృత్వంలో నిర్వహించనున్న శబరిమల మహా పాదయాత్రకు పల్లె బ్రదర్స్ ఆర్థిక సహాయం అందించారు. అక్టోబర్ 12న షాద్‌నగర్ నుంచి ప్రారంభం కానున్న ఈ మహా పాదయాత్రలో సుమారు 100 మంది అయ్యప్ప స్వాములు పాల్గొననున్నారు. 37 రోజుల పాటు పాదయాత్రగా శబరిమలకు వెళ్లే స్వాములకు అవసరమైన ఏర్పాట్లలో భాగంగా వంట పాత్రల కోసం పల్లె బ్రదర్స్‌లో ఒకరైన పల్లె బాలేశ్వర్ రూ.1,10,000 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా పల్లె బ్రదర్స్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలకు సహకరించడం ఆనందంగా ఉందని తెలిపారు. భగవంతుడి కృప, అయ్యప్ప స్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. పాదయాత్రకు సహకారం అందించిన పల్లె బ్రదర్స్‌కు శ్రీ రుద్ర ఆర్యనాథన్ గోసేవా ట్రస్ట్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు.

# సంచార జాతి పిల్లల కోసం పాఠశాల నిర్మాణం

### దాతల సహకారంతో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

### 'బడి కావాలన్న పేద పిల్లల కోరిక తీర్చాం'





**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్ 23:** సంచార జాతులకు చెందిన పేద పిల్లల విద్య కోసం షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ మరో ముందడుగు వేశారు. ఫరూఖ్‌నగర్ మండలం హాజిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సిండికేట్ కాలనీలో సంచార జాతుల పిల్లల కోసం నిర్మించనున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనానికి ఎమ్మెల్యే శంకర్ శంకుస్థాపన చేశారు. దాతల సహకారంతో పాఠశాల భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించడమే తన లక్ష్యమన్నారు. "బడి కావాలని పేద పిల్లలు అడిగినప్పుడు ఎంతో చలించిపోయాను. వారికి విద్య అందించడం మనందరి బాధ్యత" అని అన్నారు. పేద విద్యార్థుల చదువులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. విద్యార్థులకు యూనిఫామ్‌లు, ఇతర అవసరాలు అందించేందుకు దాతలు, మీడియా ప్రతినిధులు సహకరించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైతులు విద్యుత్ భద్రత పాటించాలి:వార్డు మెంబర్స్ ఫోరం షాద్‌నగర్ అధ్యక్షుడు మామిడిపల్లి శ్రీకాంత్ యాదవ్

- ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల వద్ద అప్రమత్తత అవసరం
- వర్షాకాలంలో విద్యుత్‌తో జాగ్రత్త




**తొలి అక్షరం/షాద్ నగర్,సెప్టెంబర్23:** షాద్‌నగర్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ వార్డు మెంబర్స్ ఫోరం షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు మామిడిపల్లి శ్రీకాంత్ యాదవ్ సూచించారు. వర్షాల సమయంలో పొలాల్లో విద్యుత్ వైర్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యుత్ అవగాహన లేకుండా తడిసిన విద్యుత్ పరికరాలను తాకడం, స్వయంగా మరమ్మతులు చేయడం చేయరాదని సూచించారు. పొలాల్లో విద్యుత్ వైర్లు తెగిపడటం, స్తంభాలు దెబ్బతినడం లేదా ఇతర సమస్యలు కనిపిస్తే వెంటనే సంబంధిత విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. రైతులు విద్యుత్ సిబ్బంది వచ్చే వరకు ప్రమాద ప్రాంతానికి దూరంగా ఉండాలని సూచించారు. వర్షాల సమయంలో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని, కుటుంబ సభ్యులకు కూడా విద్యుత్ భద్రతపై అవగాహన కల్పించాలని శ్రీకాంత్ యాదవ్ కోరారు. నిర్లక్ష్యానికి తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు.

# ప్రజలంతా ఐక్యంగా నిర్వహించే వినాయక ఉత్సవాలు స్ఫూర్తిదాయకం

### బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్

### తంగెలపల్లిలో గణపయ్యకు ప్రత్యేక పూజలు... అన్నదానంలో పాల్గొన్న రవీందర్ యాదవ్





**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్ 23:** కొందుర్గ్ మండలం తంగెలపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ పాల్గొన్నారు. వినాయక మండపం వద్ద గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. వినాయక ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా, ప్రజలంతా కలిసిమెలిసి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం అభినందనీయమని రవీందర్ యాదవ్ అన్నారు. తంగెలపల్లిలో భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించిన ఆయన, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, మాజీ ఎంపీపీ పోతురాజు జంగయ్య గోపాల్, సర్పంచ్ బుగ్గ కృష్ణ, మాజీ సర్పంచులు రాజారామేశ్వర్ రెడ్డి, బాలరాజు, గోవిందు, శ్రవణ్ పట్వారీ, రవి గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షులు దివిటి శ్రీను, నాయకులు నర్సింలు గౌడ్, వెంకటేష్, రవి గౌడ్, రామకృష్ణ, శంకర్ గౌడ్, సత్యనారాయణ, యాదగిరి, ఉప్పరి సత్యం, సోహైల్, కుమ్మరి గణేష్, కుమ్మరి మహేష్, వెంకటయ్య, సాయిలు, గొల్ల మల్లేష్, ఆంజనేయులు, నర్సింలు, గొల్ల అనిల్, మోహిన్, ప్రవీణ్, సిద్ధప్ప గౌడ్, నీరటి అశోక్, గొల్ల యాదగిరి, ఎర్ర అంజి, నీరటి రవి, మహమ్మద్, నరేందర్, ఉప్పరి చరణ్, నగరం శ్రీనివాస్, డబ్బు శ్రీనివాస్, కాశ మల్లేష్, అబ్దుల్ కలాం, కుమ్మరి బాలరాజు, శ్రీను, శేఖర్ గౌడ్, శివ, పుట్టపాటి శ్రీను, భిక్షపతి, నరేష్, శ్రీను, సత్యం, జంగం గోపాల్, మహేష్ గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వర్షాకాలంలో విద్యుత్ భద్రత పాటించాలి

- విద్యుత్ ప్రమాదాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలి: సర్పంచ్ లావణ్య రమేష్
- ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్లొద్దు
- విద్యుత్ సమస్యలుంటే అధికారులకు సమాచారం ఇవ్వాలి



**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్ 23:** నందిగామ మండలం మోత్కూల గూడ గ్రామంలో రైతులు వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ జెట్ట లావణ్య రమేష్ సూచించారు. పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల వద్దకు రైతులు వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు. వర్షాలు కురిసే సమయంలో విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తేమ కారణంగా విద్యుత్ లీకేజీ జరిగి షాక్ కొట్టే ప్రమాదం ఉంటుందని తెలిపారు. వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లే రైతులు విద్యుత్ పరికరాల సమీపంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ తీగలు తెగిపడటం, స్తంభాలు దెబ్బతినడం, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సమస్యలు కనిపిస్తే వాటిని తాకకుండా వెంటనే సంబంధిత విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. రైతులు స్వయంగా మరమ్మతులు చేయడానికి ప్రయత్నించకూడదన్నారు. ప్రతి ఒక్కరూ విద్యుత్ భద్రతా నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని జెట్ట లావణ్య రమేష్ సూచించారు.

# వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి

### యువతకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పిలుపు

### పట్టణంలో పలు నిమజ్జన ఉత్సవంలో ఆధ్యాత్మిక శోభ..

### భక్తుల కోలాహలం మధ్య ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఉత్సాహ భరిత నృత్యం



**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్ 23:** వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించాలని ఎమ్మెల్సీ ఎన్.నవీన్ రెడ్డి యువత,ఉత్సవ కమిటీ సభ్యులకు పిలుపునిచ్చారు. వినాయక చవితి ఉత్సవాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే గొప్ప వేదికగా నిలుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం షాద్ నగర్ పట్టణంలోని నెహ్రూ కాలనీ,ఈశ్వర్ కాలనీ,చీ+టూ,ఎస్ ఆర్,ఆఫీసర్స్ తదితర కాలనీలలోఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పర్యటించారు.పలు వినాయక మండపాలను సందర్శించి గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు, యువతతో మాట్లాడిన ఆయన.. నిమజ్జన వేడుకలను భక్తిశ్రద్ధలతో, సంయమనంతో నిర్వహించాలని సూచించారు.ఈశ్వర్ కాలనీ,ఆఫీసర్స్ కాలనీలలో నిర్వహించిన గణపయ్య నిమజ్జన వేడుకల్లో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పాల్గొని విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేసి కాలనివాసుల కోలాహలం మధ్య ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఉత్సాహ భరిత నృత్యం చేశారు.అనంతరం కమిటీ సభ్యులుతో కలిసి నిమజ్జన ఊరేగింపులో పాల్గొని ఉత్సాహాన్ని నింపారు.ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి ఉత్సవ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా నవీన్ రెడ్డి మాట్లాడుతూ.. వినాయక ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా యువతలో ఐక్యత, సామాజిక బాధ్యత, భారతీయ సంస్కృతిసంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించేందుకు దోహదపడుతున్నాయని అన్నారు. ఉత్సవాల నిర్వహణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండేలా గణనాథుడు కరుణించాలని ప్రార్థించినట్లు తెలిపారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండాలని, గ్రామీణ ప్రాంతాల్లో సంతోషం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అశోక్,మాజీ కౌన్సిలర్స్ ఈశ్వర్ రాజు,చింటూ ప్రతాప్ రెడ్డి,పాలమకుల చిన్నయ్య,చిన్న యాదగిరి,చెట్ల పావని నరసింహులు,పోమల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి,నాయకులు రాజవర ప్రసాద్,శేరి శ్రీనివాస్ రెడ్డి,శేఖర్, దినేష్ సాగర్,శివ చారి,భాస్కర్, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్‌లోని ఆశాకాలనీ ఘనంగా గణేష్ ఉత్సవాలు

- రూ.47,600లకు లడ్డు ప్రసాదం వేలం
- వేలంపాటలో కలశం, వినాయక వస్త్రం సొంతం

**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్ 23:** షాద్ నగర్‌లోని ఆశా కాలనీ ఏకదంతా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డు ప్రసాదం, చిన్న లడ్డు, కలశం మరియు వినాయక వస్త్రాల వేలంపాట భక్తులను ఆకట్టుకుంది. లడ్డు ప్రసాదాన్ని రూ.47,600లకు యెన్నం గోపాల్ రెడ్డి, ఉమా రెడ్డి దంపతుల కుమారుడు, కోడలు యెన్నం కరుణాకర్ రెడ్డి, స్వాతి రెడ్డి దంపతులు దక్కించు కున్నారు. చిన్న లడ్డును జట్టిగారి మాధవరెడ్డి, సుగుణమ్మ దంపతులు వేలంపాటలో సొంతం చేసుకు న్నారు. అలాగే కలశం, వినాయక వస్త్రాన్ని రూ.25,000లకు యెన్నం కరుణాకర్ రెడ్డి, స్వాతి రెడ్డి దంపతులు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్స వాలను విజయవంతం చేశారు. యూత్ అసోసియేషన్ సభ్యులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.



# కరీంనగర్‌లో ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవం

- కొత్తపల్లి నిమజ్జనం పాయింట్‌ను ప్రారంభించిన మేయర్ కొలగాని శ్రీనివాస్
- శోభయాత్రతో తరలివచ్చిన గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేసి... వీడ్కోలు పలికిన మేయర్

**తొలి అక్షరం/కరీంనగర్, సెప్టెంబర్23:** నగరంలో గత తొమ్మిది రోజులుగా భక్తుల పూజలు, భజనలు, విశేష అభిషేకాలందుకున్న లంబోదరుడు గంగమ్మ ఒడికి చేరేందుకు సిద్ధమయ్యాడు. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో గణేష్ నిమజ్జన ఉత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రారంభమయ్యాయి. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొత్తపల్లి వద్ద ఏర్పాటు చేసిన నూతన నిమజ్జనం పాయింట్ వద్ద విగ్రహాల నిమజ్జన ప్రక్రియ శోభాయమానంగా మొదలైంది. ఈ కార్యక్రమాన్ని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ లాంఛనంగా ప్రారంభించారు. కొత్తపల్లి పాయింట్‌కు తరలివచ్చిన మొట్ట మొదటి వినాయక విగ్రహానికి మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేసి....క్రేన్ సహాయంతో విగ్రహాన్ని నిమజ్జనం చేసి, విగ్నేశ్వరుడికి భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలికారు.



# నవ కంటోన్మెంట్ లక్ష్యంగా అభివృద్ధి బాట

- కంటోన్మెంట్ సీఈఓ అరవింద్ కుమార్ ద్వివేదితో ఎమ్మెల్యే శ్రీగణేష్ భేటీ
- రూ.8.5 కోట్లతో కమ్యూనిటీ హాళ్లు..రూ.5.72 కోట్లతో 4 పట్టణ ఆరోగ్య కేంద్రాలు
- స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఆరోగ్య కేంద్రాలకు తక్షణమే ఎన్ఓసీలు ఇవ్వాలని విజ్ఞప్తి
- రూ. 303 కోట్ల నిధులతో పారిశుధ్య వ్యవస్థ ప్రక్షాళన



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు), సెప్టెంబర్ 23:** నవ కంటోన్మెంట్ నిర్మాణమే ధ్యేయంగా నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీగణేష్ స్పష్టం చేశారు. బుధవారం కంటోన్మెంట్ బోర్డు సీఈఓ అరవింద్ కుమార్ ద్వివేదితో ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేకంగా సమావేశమ య్యారు. నియోజకవర్గంలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులు, మంజూరైన నిధుల వినియోగం అనుమతుల (ఎన్ఓసీ) మంజూరుపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. **త్వరితగతిన అనుమతులు ఇవ్వాలి:** ప్రజా అవసరాలు, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పలు కీలక ప్రాజెక్టులకు సంబంధించిన అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని సీఈఓను ఎమ్మెల్యే కోరారు. కమ్యూనిటీ హాళ్లు: కంటోన్మెంట్ వ్యాప్తంగా ప్రజా ప్రయోజనాల నిమిత్తం కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం కోసం రూ. 8.5 కోట్ల నిధులు మంజూరయ్యాయని.. ఈ నిర్మాణాలకు సంబంధించి బోర్డు నుంచి వెంటనే నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ (ఎన్ఓసీ) జారీ చేయాలన్నారు. వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు: ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించేందుకు రూ. 5.72 కోట్లతో బోయిన్‌పల్లి, తిరుమలగిరి, పికెట్, బొల్లారంలో నిర్మించనున్న 4 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల నిర్మాణాలకు ఎన్వోసీలను తక్షణమే మంజూరు చేయాలని స్పష్టం చేశారు. ఆధునిక స్పోర్ట్స్ కాంప్లెక్స్: స్థానిక యువతలోని క్రీడా ప్రావీణ్యాన్ని ప్రోత్సహించేందుకు ధోబీఘాట్ గ్రౌండ్‌లో ఆధునిక స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి మార్గం సుగమం చేయాలన్నారు. రూ. 303 కోట్లతో పారిశుధ్య వ్యవస్థ ప్రక్షాళన ఎలివేటెడ్ కారిడార్ భూముల పరిహారం కింద కంటోన్మెంట్‌కు సమకూరుతున్న రూ. 303 కోట్ల భారీ నిధులతో నియోజకవర్గంలో పారిశుధ్య (సానిటేషన్) వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలని ఎమ్మెల్యే శ్రీగణేష్ సూచించారు. డ్రైనేజీ, చెత్త తరలింపు పనులను అత్యంత వేగవంతంగా చేపట్టాలన్నారు. **సీఈఓ సానుకూల స్పందన:** కంటోన్మెంట్ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అభివృద్ధి పనులు వేగవంతమయ్యేలా బోర్డు అధికారులు పూర్తి సహకారాన్ని అందించాలని ఎమ్మెల్యే కోరగా సీఈఓ అరవింద్ కుమార్ ద్వివేది సానుకూలంగా స్పందించారు. పెండింగ్ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసి, నవ కంటోన్మెంట్ అభివృద్ధికి బోర్డు తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# కుటుంబసమేతంగా మహాగణపతి దర్శనం

- ఖైరతాబాద్ వినాయకుడికి ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రత్యేక పూజలు
- ఘన స్వాగతం పలికిన ఉత్సవ కమిటీ సభ్యులు
- రాష్ట్ర ప్రజలకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని స్వామివారి ప్రార్థన




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి( పి.సైదులు), సెప్టెంబర్23:** గణేష్ చతుర్థి నవరాత్రి ఉత్సవాల వేళ శ్రీ మహాగణపతి దివ్యాశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పదవ రోజు రాత్రి ఖైరతాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక వినాయక మండపాన్ని ఆయన కుటుంబ సమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే శ్రీగణేష్ దంపతులకు, కుటుంబ సభ్యులకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఎమ్మెల్యే కుటుంబానికి వేదాశీర్వచనంతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు. **భక్తులతో ఆత్మీయ కలయిక:** పూజా కార్యక్రమాల అనంతరం ఉత్సవ కమిటీ నిర్వాహకులు, దర్శనానికి వచ్చిన భక్తులతో ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆత్మీయంగా ముచ్చటించారు. వినాయక చవితి వేడుకల విశేషాలను, ఉత్సవ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. లంబోదరుని కృపాకటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉండాలని, నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఐక్యత, శాంతిసౌభాగ్యాలు విలసిల్లాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, కంటోన్మెంట్ నియోజకవర్గ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకున్న డీజీపీ సీవీ ఆనంద్

- ఈ నెల రెండు రోజులూ భారీగా నిమజ్జనాలు
- సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం డీజేలు, బాణసంచాకు స్వస్తి చెప్పాలి
- నగరంలో 30 వేల మందితో బందోబస్తు
- షీటీమ్స్, టాస్క్‌ఫోర్స్ నిఘా






**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు), సెప్టెంబర్ 23:** గణేష్ నిమజ్జనోత్సవాలు అత్యంత ప్రశాంతంగా, సురక్షితమైన వాతావరణంలో ముగిసేలా అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. బుధవారం ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకున్న ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ గణనాథుడి ఆశీస్సులు లభించాలని, అందరూ సుఖసంతోషాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు. సెంట్రల్ జోన్ డీసీపీగా పనిచేసిన కాలం నుంచీ తనకు ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీతో 13 ఏళ్లుగా నిరంతర అనుబంధం ఉందని డీజీపీ గుర్తుచేసుకున్నారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు సందీప్, రాజ్‌కుమార్, వీణ, మహేష్ యాదవ్‌లతో పాటు ఇతర సభ్యులంతా ఏటా నిమజ్జనం శాంతియుతంగా పూర్తయ్యేందుకు పోలీసు శాఖకు పూర్తి స్థాయిలో సహకరిస్తున్నారని ప్రశంసించారు. ఉత్సవాలను దిగ్విజయంగా నిర్వహిస్తున్న కమిటీ సభ్యులకు, రాత్రింబవళ్లు శ్రమిస్తున్న పోలీసు, వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బందికి ఆయన ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. పది రోజుల పాటు వైభవంగా సాగిన నవరాత్రి ఉత్సవాలు ముగింపు దశకు చేరాయని, గురు, శుక్రవారాల్లో నగరవ్యాప్తంగా భారీ ఎత్తున నిమజ్జనాలు జరిగే అవకాశముందని డీజీపీ తెలిపారు. భద్రత నిమిత్తం ఒక్క హైదరాబాద్ నగరంలోనే దాదాపు 30 వేల మంది పోలీసులతో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాల్లోనూ సీపీలు, ఎస్పీలు క్షేత్రస్థాయిలో ఉంటూ పరిస్థితిని సమీక్షిస్తున్నారని చెప్పారు. జీహెచ్ఎంసీ, విద్యుత్, జలమండలి, పోలీస్ శాఖల ఉమ్మడి ఆధ్వర్యంలో హుస్సేన్‌సాగర్‌తో పాటు నగరంలోని వివిధ తటాకాలు, బేబీ పాండ్ల వద్ద ఏర్పాట్లు పూర్తయ్యాయని ట్యాంక్‌బండ్‌పై తగినన్ని క్రేన్లను అందుబాటులో ఉంచామని వివరించారు. నిమజ్జన ఊరేగింపుల్లో జనం రద్దీని ఆసరాగా చేసుకుని దొంగతనాలకు పాల్పడేవారిపై, మహిళలను వేధించేకతాయిలపై ఉక్కుపాదం మోపేందుకు షీ టీమ్స్, టాస్క్‌ఫోర్స్ రంగంలోకి దిగాయి. ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ విభాగాలు సంయుక్తంగా రౌండ్ ది క్లాక్ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నాయి. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు నిమజ్జన ఊరేగింపులలో భారీ శబ్దాలు చేసే డీజేలు, ప్రమాదకర బాణసంచా వినియోగంపై సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిందని డీజీపీ స్పష్టం చేశారు. అధిక శబ్దాల వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఉత్సవ కమిటీలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి డీజేలు, బాణసంచా వినియోగానికి దూరంగా ఉండాలని నిర్ణయించు కోవడం శుభపరిణామమని కొనియాడారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరించి వేడుకల ను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# గణనాథుని దివ్యాశీస్సులతో అందరికీ ఆయురారోగ్యాలు

- బస్తీల్లోని వినాయక మండపాల్లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రత్యేక పూజలు
- ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో విజయవంతం కావాలని పిలుపు





**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు) సెప్టెంబర్23:** గణేష్ చతుర్థి నవరాత్రి ఉత్సవాల వేళ స్వామివారి దివ్యాశీస్సులతో కంటోన్మెంట్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆకాంక్షించారు. ఉత్సవాల్లో భాగంగా పదవ రోజు రాత్రి నియోజకవర్గంలోని లాలాపేట్, మహాత్మానగర్, బాలంరాయి దండు మారెమ్మ దేవాలయం బస్తీ, మర్డ్‌ఫోర్ట్ తదితర ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను ఆయన సందర్శించి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులు, స్థానిక భక్తులతో ఎమ్మెల్యే ఆత్మీయంగా ముచ్చటించారు. ఉత్సవ ఏర్పాట్లు, నిమజ్జన సన్నాహాల గురించి అడిగి తెలుసుకున్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ప్రశాంత వాతావరణంలో, పూర్తి భక్తిశ్రద్ధలతో విజయవంతంగా నిర్వహించుకోవాలి. స్వామివారి కృపతో బస్తీల్లో ఐక్యత, శాంతిసౌభాగ్యాలు విలసిల్లాలి. **-శ్రీగణేష్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే** ఎమ్మెల్యే రాకతో ఆయా బస్తీల్లో ఉత్సవ శోభ మరింత సంతరించుకోగా, నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాలల భద్రత అందరి బాధ్యత

- డీఐ వరుణ్ కాంత్ రెడ్డి
- జాన్సన్ గ్రామర్ స్కూల్‌లో పోక్సో అవగాహన సదస్సు




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు), సెప్టెంబర్ 23:** పిల్లల భద్రత, సంరక్షణలో పాఠశాలల యజమాన్యాలు, ఉపాధ్యాయులతో పాటు నాన్-టీచింగ్ సిబ్బంది ప్రమేయం చాలా కీలకమని నాచారం పోలీసు డివిజన్ డీఐ వరుణ్ కాంత్ రెడ్డి స్పష్టం చేశారు. నాచారం మెయిన్ రోడ్‌లోని జాన్సన్ గ్రామర్ స్కూల్ (ఐసిఎస్ఐ)లో పోక్సో చట్టంపై బుధవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఐ వరుణ్ కాంత్ రెడ్డి, ఎస్సై మైబెల్లీ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. డీఐ మాట్లాడుతుంటే... పాఠశాల ఆవరణలోనే కాకుండా రవాణా వ్యవస్థలోనూ విద్యార్థుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలి అని తెలిపారు. పిల్లలపై జరిగే లైంగిక వేధింపులు, నేరాలను అరికట్టడంలో పోక్సో చట్టం అత్యంత కీలకమైనది అని అన్నారు.

పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, వాహన డ్రైవర్లు, సెక్యూరిటీ సిబ్బంది పిల్లల ప్రవర్తనలోని మార్పులను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలి అని సూచించారు. ఏదైనా అనుమానాస్పద సంఘటన జరిగినా లేదా పిల్లలు సమస్యను తమ దృష్టికి తెచ్చినా వెంటనే యాజమాన్యం, పోలీసుల దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు.

అనంతరం ఎస్సై మైబెల్లీ మాట్లా డుతూ... బాలల హక్కుల పరిరక్షణకు, లైంగిక నేరాల నుంచి వారికి రక్షణ కల్పించేందుకు అమల్లో ఉన్న చట్టాలపై సమగ్రంగా వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది, బస్సు డ్రైవర్లు, సెక్యూరిటీ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రసాదాల్లో భద్రత... ఆరోగ్యానికి మేలు

- గణేష్ సురక్ష సంకల్ప్-2026లో ఫుడ్ సేఫ్టీ అవగాహన సదస్సు
- ఆహార పరిశుభ్రతపై సీఐ ధనుంజయ, డీఐ వరుణ్ కాంత్ రెడ్డి సూచనలు

**తొలి అక్షరంరాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),సెప్టెంబర్23:** గణేష్ ఉత్సవాల సందర్భంగా మండపాల వద్ద వితరణ చేసే ప్రసాదాలు,ఆహార పదార్థాల తయారీలో పరిశుభ్రత, నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని నాచారం సీఐ ధనుంజయ,డీఐ వరుణ్ కాంత్ రెడ్డి సూచించారు. గణేష్ సురక్ష సంకల్ప్ 2026 కార్యక్రమంలో భాగంగా బాబా నగర్‌లోని శ్రీ సిద్ధి వినాయక యూత్ (ప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో) ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫుడ్ సేఫ్టీ అవగాహన సదస్సులో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఉత్సవ నిర్వాహకులకు, ప్రజలకు ఫుడ్ సేఫ్టీ నిబంధనలపై అధికారులు అవగాహన కల్పించారు. సీఐ, డీఐలు మాట్లాడుతూ...మండపాల వద్ద భక్తులకు అందించే ప్రసాదాలు, ఆహారం తయారీలో తీవ్ర అజాగ్రత్త వహిస్తే ఆహారం కలుషితమై భక్తుల ఆరోగ్యంపై ప్రభావం చూపే ప్రమాదముంది. ఉత్సవ నిర్వాహకులు ఫుడ్ సేఫ్టీ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ, పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహారాన్ని మాత్రమే పంపిణీ చేయాలి“ అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మైబెల్లీ కూడా పాల్గొని పలు సూచనలు చేశారు. **అపరిశుభ్ర ఆహారంతో అనారోగ్యాలు: డాక్టర్ శిరీష** ప్రసాద్ హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ శిరీష మాట్లాడుతూ...కలుషిత ఆహారం, నీటి ద్వారా త్వరగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. పరిశుభ్రమైన ఆహారపు అలవాట్లు, సురక్షితమైన నీటి వినియోగం మరియు ఆహార భద్రతా పద్ధతులను వివరించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన, కల్తీ లేని, సురక్షితమైన ఆహారాన్ని తీసుకోవడమే ధ్యేయంగా నిర్వహించిన ఈ సమావేశంలో మండప నిర్వాహకులు, యూత్ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కూచిపూడితో మెప్పించిన డింపుల్ హయాతి..

## తిరుమలలో ప్రత్యేక ప్రదర్శన!



టాలీవుడ్ అందాల భామ డింపుల్ హయాతి తిరుమలలోని నాద నీరాజనం వేదికపై అద్భుతమైన కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి భక్తులను, ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఎరుపు, గోల్డ్ కలర్ సిల్క్ చీర కట్టి, సంప్రదాయ వస్త్రధారణలో భక్తిశ్రద్ధలతో ఆమె ప్రదర్శించిన కూచిపూడి నాట్యం అందరినీ మంత్రముగ్ధులను చేసింది.ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఆ విశేషాలు చూద్దాం.. శ్రీవారి బ్రహ్మోత్సవాల పవిత్ర సమయంలో డింపుల్ హయాతి నాద నీరాజనం వేదికపై కూచిపూడి నాట్యం చేయడం విశేషం. సంప్రదాయబద్ధమైన నృత్య భంగిమలు, చక్కటి ముఖకవళికలతో ఆమె చేసిన ప్రదర్శన భక్తులకు కనులవిందుగా నిలిచింది. ఇక నృత్య ప్రదర్శనకు ముందు రోజు ఆమె తిరుమల శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. నెటిజన్ల ఆశ్చర్యం, ప్రశంసలు : ఇన్నాళ్లూ సినిమాల్లో గ్లామరస్ పాత్రల్లో అలరించిన డింపుల్ హయాతిలో ఈ స్థాయి సంప్రదాయ నాట్య ప్రతిభ కూడా ఉందా అని నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. ఇక సోషల్ మీడియాలో ఆమె డ్యాన్స్ వీడియోలు చూసిన అభిమానులు "డింపుల్ గారు చాలా అందంగా, అద్భుతంగా నాట్యం చేశారు" అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.సినిమా కెరీర్ మరియు క్రేజ్: తెలుగు, తమిళ సినిమాల్లో నటించి మంచి నటిగా పేరు తెచ్చుకున్న డింపుల్, వరుణ్ తేజ్ నటించిన 'గద్దలకొండ గణేష్' చిత్రంలో 'జర్రా జర్రా' స్పెషల్ సాంగ్‌తో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. ఆ తర్వాత ఖిలాడి, రామబాణం, ఆత్రంగి రే, వీరమే వాగై సూడుమ్, భర్త మహాశయులకు విజ్ఞప్తి వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులకు దగ్గరైంది. 'ఆదర్శ కుటుంబం'తో త్వరలో ముందుకు: ప్రస్తుతం సరైన సినిమా బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న డింపుల్ హయాతి, త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో వెంకటేష్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంలో నటిస్తున్నట్టు టాక్. ఈ భారీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం అక్టోబర్ 9న థియేటర్లలోకి రాబోతోంది. ఈ సినిమాతో ఆమెకు పెద్ద హిట్ అందుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.ఇక అంతేగాక శర్వానంద్ 38వ సినిమా సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రంలో ఓ పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం.వెండితెరపై తన గ్లామర్, నటనతో ఆకట్టుకునే డింపుల్ హయాతి, తిరుమలలో ప్రదర్శించిన కూచిపూడి నాట్యంతో తనలోని సంప్రదాయ కళాత్మక కోణాన్ని ఆవిష్కరించారు. భక్తిభావంతో ఆమె చేసిన ఈ ప్రదర్శన ప్రతి ఒక్కరి మనసులను దోచుకోవడమే కాకుండా, ఆమె కెరీర్‌కు మరింత సానుకూలతను తీసుకువస్తుందనడంలో సందేహం లేదు.

# ఇక మైత్రీ థియేటర్లలో 'సర్వపిండి'..


## సినిమా చూస్తూ కమ్మని రుచి.. 'ది ప్యారడైజ్'తో ఎంట్రీ!




ప్రముఖ నిర్మాణ, పంపిణీ సంస్థ 'మైత్రీ' తమ థియేటర్ల ద్వారా ఓ వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. సినిమా అనుభూతికి తెలంగాణ సంస్కృతిని, అచ్చమైన పల్లె రుచులను జోడిస్తూ సరికొత్త నిర్ణయం తీసుకుంది. ఇకపై తమ థియేటర్లలో తెలంగాణ సంప్రదాయ వంటకమైన 'సర్వపిండి'ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారికంగా ప్రకటించింది.

తొలి దశలో భాగంగా మైత్రీ విమల్, మైత్రీ శివగంగ థియేటర్లలో ఈ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్నారు. త్వరలో విడుదల కానున్న భారీ చిత్రం 'ది ప్యారడైజ్' ప్రదర్శన సమయంలో విరామంలో ప్రేక్షకులు ఈ కమ్మని సర్వపిండిని ఆస్వాదించవచ్చు. సినిమా చూస్తూనే, తెలంగాణ ప్రత్యేక వంటకాన్ని రుచి చూసే ఈ కొత్త అనుభవం సినీ ప్రియులను ఆకట్టుకుంటుందని సంస్థ భావిస్తోంది.ఈ సరికొత్త ఆలోచన వెనుక సోషల్ మీడియాలో ప్రజాదరణ పొందిన 'బామ్మాస్టోరీస్'కు చెందిన 77 ఏళ్ల బామ్మ కృషి ఉంది. ఓ చిన్న టిఫిన్ సెంటర్‌లో ఆమె ప్రేమతో తయారు చేసే సర్వపిండి, ఇప్పుడు ఏకంగా బిగ్ స్క్రీన్ ప్రేక్షకులకు చేరువ కావడం విశేషం. వెండితెరపై దృశ్యాలను ఆస్వాదిస్తూనే, తెలంగాణ అసలైన రుచిని అందించాలన్న మైత్రీ థియేటర్స్ ప్రయత్నంపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# పుష్ప సినిమాలో ఆ పాత్ర నేను చేయాల్సింది.. కానీ!: శివాజీ



టాలీవుడ్ నటుడు శివాజీ 'తెల్ల కాగితం' సినిమా ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతూ... ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన దిగ్గజ చిత్రం 'పుష్ప'కు సంబంధించి ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. 'పుష్ప' చిత్రంలో దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న ప్రతి నాయక ఛాయలున్న 'మంగళం శ్రీను' పాత్ర మొదట తనకే రావలసి ఉందని శివాజీ తెలిపారు.ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ... "మంగళం శ్రీను పాత్రకు మొదట సుకుమార్ నన్నే అనుకున్నారు. కానీ ఒక పాత్ర ఎవరికి రాసి ఉంటే చివరికి వాళ్లకే దక్కుతుంది. నాకు రాసి లేని పాత్రను నేనెలా చేయగలను? ఆ పాత్ర సునీల్‌కే రాసి పెట్టి ఉంది, అందుకే ఆయన వద్దకు వెళ్లింది. సునీల్ ఆ పాత్రలో అద్భుతంగా జీవించారు, ఎవరు ఏ పాత్ర చేసినా చివరికి అది వాళ్లకే సరిపోతుంది" అని వ్యాఖ్యానించారు.'తెల్ల కాగితం' విశేషాలను ఆయన పంచుకుంటూ... సినిమాల్లోకి రీ-ఎంట్రీ ఇచ్చే సమయంలో తాను విన్న రెండో కథ ఇదేనని, కథ బాగా నచ్చడంతో ఈ చిత్రాన్ని తానే నిర్మించాలని అనుకున్నట్లు తెలిపారు. అయితే ఈ కథ పలువురు నిర్మాతల చేతులు మారి, చివరకు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ అధినేత దిల్ రాజు, కృష్ణ కొమ్మలపాటి సంయుక్త నిర్మాణంలో తెరకెక్కి తన వద్దకే రావడంతో ఎంతో సంతోషంగా ఉందన్నారు. రమేశ్ బండ్రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాతో పాటు, గ్రాఫిక్స్ కు ప్రాధాన్యత ఉన్న 'కూర్మావతారం' అనే చిత్రంలోనూ తాను నటిస్తున్నట్లు శివాజీ వెల్లడించారు.

# 'ప్యారడైజ్'లో నాని 'జడల్' పాత్రకు స్ఫూర్తి ఈ ఫొటోనే!



నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటించిన తాజా యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్'. ఈ చిత్రం రేపు (సెప్టెంబరు 24) విడుదల కానున్న నేపథ్యంలో, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సినిమాలోని కీలకమైన 'జడల్' పాత్రకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. ఈ పాత్రకు, ముఖ్యంగా నాని జడల లుక్‌కు తన చిన్ననాటి జ్ఞాపకాలే స్ఫూర్తి అని ఆయన వెల్లడించారు.

ఈ సందర్భంగా శ్రీకాంత్ ఓదెల సోషల్ మీడియాలో తన చిన్ననాటి ఫొటోను పంచుకుంటూ ఒక భావోద్వేగ పోస్ట్ పెట్టారు. "జడల్ పుట్టుక, యుద్ధం కల్పితం కావచ్చు... కానీ అతని జడలు, లుక్ నా చిన్నప్పటి స్ఫూర్తితో వచ్చినవే. అమ్మ నాకు 5, 6 ఏళ్ల వయసు వరకు జడలు వేసి కట్టేవారు. నేను పెద్దయ్యాక, కమర్షియల్ సినిమాలో ఒక హీరో జడలతో 70ఎంఎం స్క్రీన్‌పై ఎలా ఉంటాడా అని ఎప్పుడూ ఊహించుకునేవాడిని. ఇప్పుడు నా హీరో నాని అన్నను జడల్‌గా మీ ముందు ఉంచుతున్నాను. ఈ చిత్రం కేవలం నా చిన్నతనం కాదు, నా ప్యారడైజ్" అని ఆయన పేర్కొన్నారు.

శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో నాని 'జడల్' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన లుక్ ఇప్పటికే ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచింది. ఈ చిత్రంలో నాని సరసన కయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సీనియర్ నటుడు మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సంపూర్ణేశ్ బాబు వంటి వారు కీలక పాత్రలు పోషిస్తున్నారు. దర్శకుడు పంచుకున్న ఈ వ్యక్తిగత విషయం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది.



# తెలుగు ఇండస్ట్రీని చూసి కన్నీళ్లొచ్చాయి : 'ది ప్యారడైజ్' నటుడు రాఘవ్ జుయల్

ప్రముఖ డ్యాన్సర్, నటుడు రాఘవ్ జుయల్.. నేచురల్ స్టార్ నాని నటిస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రంతో తెలుగు సినీ పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. ఈ సందర్భంగా టాలీవుడ్‌లో పనిచేసిన అనుభవాన్ని పంచుకుంటూ, ఇక్కడి పని సంస్కృతిపై ప్రశంసల వర్షం కురిపించారు. తెలుగు పరిశ్రమలో సినిమాను ఒక వేడుకలా జరుపుకునే విధానం తనను ఎంతగానో ఆకట్టుకుందని ఆయన పేర్కొన్నారు.శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొన్నప్పుడు, సినిమా నిర్మాణం పట్ల ఇక్కడి వారికి ఉన్న అభిరుచి, గౌరవాన్ని దగ్గర నుంచి చూశానని రాఘవ్ తెలిపారు.

ఆయన మాట్లాడుతూ.. "ఇక్కడ సినిమాను, సినిమా వాళ్లను ఎంతగా గౌరవిస్తారో చూసి నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ప్రతి ఒక్క టెక్నీషియన్‌కు ఎంతో గౌరవం ఇస్తారు. సౌండ్ ఇంజనీర్‌ను కూడా ప్రేక్షకులు గుర్తుపట్టడం నన్ను ఆశ్చర్యపరిచింది. ఇక్కడ వారు కేవలం పని పూర్తి చేయడానికి రారు, సినిమాను సెలబ్రేట్ చేసుకోవడానికి వస్తారు. ఈ విషయాన్ని నేను నేర్చుకున్నాను" అని భావోద్వేగంగా చెప్పారు. తనపై దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ప్రభావం ఎంతో ఉందని కూడా రాఘవ్ చెప్పుకొచ్చారు.ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో పుట్టి పెరిగిన రాఘవ్, 'డ్యాన్స్ ఇండియా డ్యాన్స్ 3' రియాలిటీ షోతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. 'క్రాక్‌రాక్స్' అనే స్టేజ్ పేరుతో తన స్లో-మోషన్ డ్యాన్సింగ్ స్టైల్‌తో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. ఆ తర్వాత 'డ్యాన్స్ ప్లస్' వంటి అనేక విజయవంతమైన టీవీ షోలకు హోస్ట్‌గా వ్యవహరించారు.

# నంది అవార్డుల కోసం దరఖాస్తు విధానం- మార్గదర్శకాలు!






ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్ - నాటకరంగ అభివృద్ధి సంస్థ (విజయవాడ) 2025 సంవత్సరానికి సంబంధించిన -చలనచిత్ర నంది బహుమతులు - 2025- , ూఎ నంది బహుమతులు - 2025- కోసం అధికారిక ప్రకటనను విడుదల చేసింది. తెలుగు చలనచిత్ర పరిశ్రమను, టెలివిజన్ రంగాన్ని ప్రోత్సహించేలా ప్రభుత్వం ఈ పురస్కారాలను అందజేస్తోంది. అర్హులైన నిర్మాతలు, కళాకారులు, సాంకేతిక నిపుణుల నుండి దరఖాస్తులను సంస్థ ఆహ్వానించింది. చలనచిత్ర విభాగంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నంది చలనచిత్ర నిబంధనలను అనుసరించి 2025 సంవత్సరానికి ఉత్తమ ఫిల్మ్ నిర్మాతలు, ఉత్తమ కళాకారులు.. ఉత్తమ సాంకేతిక నిపుణులకు ఈ అవార్డులు ప్రదానం చేయనున్నారు. తెలుగు భాషలో భారతదేశంలో ఎక్కడైనా నిర్మించి.. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ -సీబీఎఫ్‌సీ ద్వారా థియేటర్లలో ప్రదర్శించిన చిత్రాలు, జాతీయ సమైక్యతపై చిత్రాలు, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీలు, విద్యాసంబంధమైన చిత్రాలు అలాగే తెలుగు సినిమా మీద వచ్చిన పుస్తక రచనలు, రచయితలు, నిర్మాతలు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

ఇక టెలివిజన్ రంగానికి సంబంధించి 2025 సంవత్సరానికి నంది టి.వి. చిత్ర నిబంధనల ప్రకారం ఉత్తమ టి.వి. చిత్ర నిర్మాతలు, కళాకారులు, సాంకేతిక నిపుణులను సత్కరించనున్నారు. టెలిఫిల్మ్స్, టి.వి. ఫీచర్స్, టి.వి. మెగాసీరియల్స్, డైలీ సీరియల్స్, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీ చిత్రాలు, సామాజిక అంశాలు, విద్య సంబంధిత చిత్రాల రూపకర్తలు ఈ బహుమతుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవార్డులకు సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు.. ఇతర వివరాలను సంస్థ అధికారిక వెబ్‌సైట్ **www.apsftvdc.in** ద్వారా తెలుసుకోవచ్చని స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను పొందుపరుచుటకు చివరి తేదీగా 12.10.2026ను నిర్ణయించారు. ఆన్‌లైన్ ద్వారా సమర్పించిన దరఖాస్తుల ప్రింట్ ప్రతులను సంబంధిత డాక్యుమెంట్లతో జతపరిచి నిర్దేశిత గడువులోగా అందజేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తుల హార్డ్ కాపీలను -మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్ మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థ, 4వ అంతస్తు, ఎన్.టి.ఆర్. అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, పండిత్ నెహ్రూ బస్ కాంప్లెక్స్, విజయవాడ - 520013- చిరునామాకు పంపడానికి చివరి తేదీ 16.10.2026గా ఖరారు చేసినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్, ఐ.ఏ.ఎస్., తెలిపారు. కళాకారులు - నిర్మాతలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా అధికారులు కోరారు.